RNI No Tel / 2012 /4241

ప్రతి అక్షరం.. ప్రజల పక్షం..

# హైదరాబాద్ ఎస్టేట్

తెలుగు దిన పత్రిక

THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER

hyderabadestate.co.in




సంపుటి -13 సంచిక - 420 | 11 శనివారం జూలై 2026 | ఎడిటర్: బట్టు లక్ష్మీ నారాయణ | పేజీలు - 6 వెల రూ 5 /--

### 2028 డిసెంబర్‌లో అసెంబ్లీ

# ఎన్నికలు జరగవు

**: రేవంత్ రెడ్డి**



2028 డిసెంబర్‌లో ఎన్నికలు జరగవని, నియోజకవర్గాల పునర్విభజన అనంతరం 2029 జూన్‌లో ఎన్నికలు జరుగుతాయని సీఎం రేవంత్ జోస్యం చెప్పారు. అప్పటికీ అసెంబ్లీ స్థానాలు 119 నుంచి 182కు, పార్లమెంట్ స్థానాలు 17 నుంచి 25కు పెరుగుతాయని అన్నారు. 182 స్థానాల్లో కనీసం 117 స్థానాల్లో కాంగ్రెస్ గెలిచి రెండోసారి అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. 2023 ఎన్నికల్లో కాంగ్రెస్ 65 సీట్లు గెలుస్తుందని తాము ముందే చెప్పి చేసి చూపించామని గుర్తు చేశారు. ఖమ్మం జిల్లా జగన్నాథపురంలో నిర్వహించిన రైతు ఆశీర్వాద సభలో శుక్రవారం ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.

బీఆర్ఎస్, ఆ పార్టీ అధినేత కేసీఆర్‌పై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ సందర్భంగా తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. "కేసీఆర్ ఇంట్లో ఒకరంటే ఒకరికి పడదు. కల్వకుంట్ల కౌరవ కుటుంబాన్ని పాతాళానికి తొక్కుతాం. పాపాల భైరవుడిని ఫామ్‌హౌస్‌లో బంధించాం. కాచుకో చంద్రశేఖర్ రావు.. జరగబోయే కురుక్షేత్రంలో గెలిచేది మేమే" అంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. బీఆర్ఎస్‌ను మళ్లీ మొలకెత్తనివ్వబోమని ప్రజలు సంకల్పించారని, పదేళ్ల రాక్షస పాలనకు ఇప్పటికే ముగింపు పలికారన్నారు. మరోవైపు బీఆర్ఎస్‌లో ఉంటారో లేదో హరీశ్ రావే చెప్పాలి అన్నారు. బీజేపీతో మంతనాలు జరపడం లేదా అని ప్రశ్నించారు.రైతు ఆశీర్వాద సభలో భాగంగా 1.44 లక్షల మంది రైతులకు రూ.1,009 కోట్ల రైతు భరోసా నిధులను సీఎం విడుదల చేశారు. కన్నెపల్లి పంప్‌హౌస్‌లను ప్రారంభించాలని బీఆర్ఎస్ నేతలు చేస్తున్న డిమాండ్‌ను ఆయన తప్పుబట్టారు. అలా చేస్తే భద్రాచలం రామాలయం సహా 44 గ్రామాలు ముంపునకు గురయ్యే ప్రమాదం ఉందన్నారు. ఉచిత విద్యుత్ కాంగ్రెస్ పేటెంట్ అని పేర్కొన్న రేవంత్.. "ఇప్పుడు వైర్లు పట్టుకుంటే కాలి బూడిదైపోతారు" అని వ్యాఖ్యానించారు.

### 'అన్న రాజ్యం' కాదు..

## 'అక్క రాజ్యం' ఎలా ఉంటుందో చూపిస్తా : కవిత



తెలంగాణ రక్షణ సేన ఎన్నికల్లో విజయం సాధిస్తే 'అన్న రాజ్యం' కాదు.. 'అక్క రాజ్యం' ఎలా ఉంటుందో రుచి చూపిస్తానని ఆ పార్టీ అధ్యక్షురాలు కవిత అన్నారు. రైతును నిజమైన రాజును చేస్తానని స్పష్టం చేశారు. తమ ప్రభుత్వం ఏర్పడగానే ప్రతి ప్రభుత్వ ఆఫీసులో రైతులకు ప్రత్యేక గౌరవ కుర్చీలు ఏర్పాటు చేస్తామన్నారు. మహిళల కోసం ఒక వినూత్న ఆలోచన చేశామని... త్వరలోనే దాని వివరాలు ప్రకటిస్తానని చెప్పారు. 'పాంచజన్యం' అనే నినాదంతో మార్పు కోసం ముందుకు సాగుతామని పేర్కొన్నారు.భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండలంలోని కొత్త గంగారం తదితర ఆదివాసి గ్రామాల్లో పర్యటించిన కవిత, స్థానికుల జీవన విధానాన్ని, సమస్యలను స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... వెనకబడిన గిరిజనుల హక్కుల సాధన కోసమే తాను తెలంగాణ రక్షణ సేనను స్థాపించానని, ఇక్కడికి వచ్చింది రాజకీయాల కోసం కాదని, ప్రజా సమస్యల పరిష్కారం కోసమేనని స్పష్టం చేశారు.1950 రికార్డుల్లో నాయకపోడు తెగ పేరు లేకపోవడంపై ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. గిరిజనుల హక్కుల సాధనకై అవసరమైతే ఢిల్లీ వేదికగా పోరాడతామన్నారు. కార్పొరేట్ శక్తుల వేల కోట్ల అప్పులు మాఫీ చేసిన కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం... ఆదివాసి బిడ్డలు బైక్ కొందామన్నా బ్యాంక్ లోన్లు ఎందుకు ఇవ్వడం లేదని కవిత నిలదీశారు. విదేశాల తరహాలోనే ఇక్కడి గిరిజనులకు కూడా రూ.2 లక్షల నుండి రూ.2 కోట్ల వరకు సులభంగా లోన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు.ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులను ప్రభుత్వం పక్కదారి పట్టిస్తోందని ఆరోపించిన ఆమె, ఆదివాసి పిల్లలందరికీ ఉచిత విద్య, వైద్యం అందించడం వారి ప్రాథమిక హక్కు అని గుర్తుచేశారు. ఏది సాధించాలన్నా ముందు ఒక్క అడుగుతోనే ప్రారంభమవుతుందని... అందరి సహకారం తనకు కావాలని కోరారు.

### ఆసీస్ క్రికెట్ దిగ్గజం స్టీవ్ వాకు ప్రధాని మోదీ అరుదైన కానుక..

## 20 ఏళ్ల నాటి జ్ఞాపకం



ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన ఆస్ట్రేలియా పర్యటనలో ఆ దేశ క్రికెట్ దిగ్గజం స్టీవ్ వాకు ఓ అరుదైన కానుకను అందజేసి ఆశ్చర్యపరిచారు. దాదాపు రెండు దశాబ్దాల క్రితం తామిద్దరూ తొలిసారి కలుసుకున్నప్పటి మధుర స్మృతిని గుర్తు చేస్తూ, ఆ ఫొటోను ఫ్రేమ్ చేయించి శుక్రవారం ఆయనకు బహూకరించారు. ఆస్ట్రేలియా ప్రధాని ఆంథోనీ అల్బనీస్‌తో కలిసి మెల్‌బోర్న్ క్రికెట్ గ్రౌండ్ (ఎంసీజీ)ను సందర్శించిన సందర్భంగా ఈ ఆసక్తికర సన్నివేశం చోటుచేసుకుంది.నరేంద్ర మోదీ గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో స్టీవ్ వా ఆయనతో భేటీ అయ్యారు. ఆనాటి స్మృతులను నెమరువేసుకుంటూ ప్రధాని మోదీ అందించిన ఈ వ్యక్తిగత బహుమతికి స్టీవ్ వా మంత్రముగ్ధులయ్యారు. ఈ పర్యటనలో భాగంగా ఇరు దేశాల ప్రధానులు యువ క్రీడాకారులతో సంభాషించారు. క్రికెట్, కబడ్డీ, ఆస్ట్రేలియన్ ఫుట్‌బాల్ క్రీడల్లో రాణిస్తున్న అథ్లెట్లను వారు ఉత్సాహపరిచారు. ఇదే వేదికపై 'భారత్-ఆస్ట్రేలియా క్రీడా సహకార రోడ్‌మ్యాప్'ను కూడా ఆవిష్కరించారు.ఈ పర్యటన సందర్భంగా క్రికెట్ ప్రేమికులకు మరో తీపి కబురు అందింది. 2026-27 బిగ్ బాష్ లీగ్ (బీబీఎల్) సీజన్ ప్రారంభ మ్యాచ్‌ను చెన్నైలోని ఎం.ఏ. చిదంబరం స్టేడియంలో నిర్వహించనున్నట్లు క్రికెట్ ఆస్ట్రేలియా అధికారికంగా ప్రకటించింది. డిసెంబర్ 12న మెల్‌బోర్న్ రెనెగేడ్స్, పెర్త్ స్కార్చర్స్ జట్ల మధ్య ఈ పోరు సాగనుంది. ఆస్ట్రేలియా గడ్డ వెలుపల బీబీఎల్ మ్యాచ్ నిర్వహించడం చరిత్రలో ఇదే తొలిసారి కావడం గమనార్హం.

### హనుమాన్‌గఢి మెట్లపై నమాజ్ చేయించినవారే

# ఇప్పుడు మాట్లాడుతున్నారు

**: యోగి ఆదిత్యనాథ్**



రామాలయ విరాళాల చోరీ ఆరోపణల వివాదం కొనసాగుతున్న వేళ ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ హనుమాన్‌గఢి అంశాన్ని మరోసారి తెరపైకి తీసుకొచ్చారు. అయోధ్య పర్యటన సందర్భంగా రూ.432 కోట్ల విలువైన 217 అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేసిన ఆయన.. అనంతరం జరిగిన సభలో ప్రతిపక్షాలపై తీవ్ర విమర్శలు చేశారు.గత ప్రభుత్వాల హయాంలో అయోధ్య నిర్లక్ష్యానికి గురైందని యోగి ఆరోపించారు. ఒకప్పుడు రహదారులు, విద్యుత్, తాగునీటి సౌకర్యాలు కూడా లేవని చెప్పారు. ప్రస్తుతం విశ్వాసం గురించి మాట్లాడుతున్నవారే గతంలో హనుమాన్‌గఢి మెట్లపై నమాజ్ చేయించారని విమర్శించారు. పరోక్షంగా రామమందిర విరాళాల చోరీని ప్రశ్నిస్తున్నవారిపై విమర్శలు గుప్పించారు. "జామా మసీదులో హనుమాన్ చాలీసా చదవనిస్తారా? అలా కాకపోతే హనుమాన్‌గఢి మెట్లపై నమాజ్ జరగడానికి ఎందుకు అనుమతించారు? దానికి బాధ్యులు ఎవరు?" అని ప్రశ్నించారు.తమ ప్రభుత్వం అయోధ్యను పరిశుభ్రమైన, అందమైన నగరంగా తీర్చిదిద్దిందని యోగి తెలిపారు. సరయూ నది తీరంలో ఘనంగా హారతి, రామ్‌కీ పైడీ అభివృద్ధి వంటి పనులతో అయోధ్యకు కొత్త గుర్తింపు వచ్చిందన్నారు. స్పష్టమైన విధానాలు, రాజకీయ సంకల్పం ఉంటే అసాధ్యమేమీ ఉండదని పేర్కొన్నారు.అయోధ్యలో అంతర్జాతీయ విమానాశ్రయం నిర్మాణాన్ని గతంలో సమాజ్‌వాదీ పార్టీ వ్యతిరేకించిందని యోగి ఆరోపించారు. ప్రస్తుతం మహర్షి వాల్మీకి పేరుతో ఉన్న ఆ విమానాశ్రయం దేశ, విదేశాలతో అయోధ్యను అనుసంధానిస్తోందన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విజన్‌తో అయోధ్యను దేశంలోని ఎంపిక చేసిన సోలార్ నగరాల్లో ఒకటిగా అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు.శ్రీరాముడి తమ్ముడు భరతుడి గౌరవార్థం భదర్సా ప్రాంతానికి 'భారత్‌పూర్-భరత్‌కుండ్'గా పేరు మారుస్తామని యోగి ప్రకటించారు. ప్రపంచంలో ఎక్కడైనా అయోధ్య పేరు వినగానే భారతీయుల ముఖాల్లో ఆనందం కనిపిస్తోందని, 500 ఏళ్లుగా సాధ్యం కానిది ఇప్పుడు సాకారమైందని వ్యాఖ్యానించారు.

## ఫలించిన ఎమ్మెల్యే మర్రి కృషి

### – అల్వాల్‌లో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఏర్పాటుకు మంత్రి గ్రీన్ సిగ్నల్



అల్వాల్ ప్రాంత ప్రజలకు ప్రభుత్వ సేవలు మరింత చేరువ కానున్నాయి. ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి చొరవతో అల్వాల్‌లో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఏర్పాటుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈమేరకు శుక్రవారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని కలిసిన ఎమ్మెల్యే మర్రి అల్వాల్‌లో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఏర్పాటు చేయాలని కోరగా..స్పందించిన మంత్రి వెంటనే అల్వాల్‌లో రిజిస్ట్రార్ కార్యాలయానికి తగిన స్థలం చూడాలని అధికారులను ఆదేశించారు. మంత్రి ఆదేశాలతో మల్కాజిగిరి జిల్లా రిజిస్ట్రార్ అశోక్ కుమార్ ఎమ్మెల్యేతో కలిసి అల్వాల్ సఖి సెంటర్ సమీపంలోని బాలసదన్ భవనాన్ని పరిశీలించారు. భవనంలో చిన్నచిన్న మరమ్మతులు చేపట్టి త్వరలోనే కార్యాలయాన్ని ప్రారంభించాలని అధికారులు నిర్ణయించారు.

### చర్లపల్లి జైలు నుంచి బండి భగీరథ్ విడుదల



పోక్సో కేసులో తెలంగాణ హైకోర్టు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసిన నేపథ్యంలో బండి భగీరథ్ చర్లపల్లి కేంద్ర కారాగారం నుంచి శుక్రవారం మధ్యాహ్నం విడుదలయ్యారు. హైకోర్టు ఉత్తర్వుల కాపీలు జైలు అధికారులకు అందిన అనంతరం అన్ని న్యాయపరమైన ప్రక్రియలను పూర్తి చేసి ఆయన్ను విడుదల చేశారు. ఈ సందర్భంగా జైలు వద్దకు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ కుమార్‌తో పాటు కుటుంబ సభ్యులు, సన్నిహితులు చేరుకుని భగీరథ్‌కు స్వాగతం పలికారు.బెయిల్ మంజూరు చేసిన సందర్భంగా తెలంగాణ హైకోర్టు పలు కీలక షరతులు విధించింది. దర్యాప్తు అధికారులకు పూర్తిగా సహకరించాలని, సాక్షులను లేదా ఫిర్యాదుదారులను ఎలాంటి ప్రభావానికి గురిచేయరాదని స్పష్టం చేసింది. అలాగే విచారణకు అవసరమైనప్పుడు దర్యాప్తు అధికారుల ఎదుట హాజరుకావాలని ఆదేశించింది.

### గోల్కొండ బోనాలను బాధ్యతతో నిర్వహించాలి

### దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ



మెహిదీపట్నం,జూలై 10: చారిత్రాత్మక గోల్కొండ కోటలో జగదాంబిక ఎల్లమ్మ మహంకాళి ఆలయంలో జరిగే ఆషాఢ మాసం బోనాలను ఘనంగా నిర్వహించడానికి ప్రభుత్వ శాఖల అధికారులు సమన్వయంతో ,బాధ్యతతో పనిచేయాలని దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. శుక్రవారం గోల్కొండ కోటలో ప్రభుత్వ శాఖల అధికారులతో గోల్కొండ బోనాల ఏర్పాట్లపై మంత్రి కొండా సురేఖ సన్నాహక సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గోల్కొండ బోనాలకు ఎంతో చారిత్రాత్మక నేపథ్యం ఉందని,ఈ బోనాలను అత్యంత వైభవంగా నిర్వహించడానికి ప్రభుత్వ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. పోలీస్, ట్రాఫిక్, విద్యుత్,జీహెచ్ఎంసీ,అగ్నిమాపక.జలమండలి, వైద్య,పురావస్తు,ఆర్అండ్‌బి,ఆర్టీసి,సాంస్కృతిక ,పారిశుద్ధ్య విభాగాల అధికారులు బోనాలకు కావాల్సిన అన్నీ ఏర్పాట్లు ఎలాంటి లోటు పాట్లు లేకుండా చేపట్టాలని ఆదేశించారు.

# విద్యారంగాన్ని విస్మరించిన ప్రభుత్వంపై విద్యార్థుల గళం

## – గీసుగొండ ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎదుట హోరెత్తిన నినాదాలు..

## – రాష్ట్రవ్యాప్త బంద్‌లో వామపక్ష విద్యార్థి సంఘాల ఆందోళన

గీసుగొండ, జూలై 10 హైదరాబాద్ ఎస్టేట్:
రాష్ట్రంలో పేరుకుపోయిన విద్యారంగ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఏఐఎఫ్‌డీఎస్ ఆధ్వర్యంలోని వామపక్ష విద్యార్థి సంఘాలు రాష్ట్రవ్యాప్త బంద్‌లో భాగంగా శుక్రవారం గీసుగొండ మండల కేంద్రంలో ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల బంద్ నిర్వహించాయి. అనంతరం గీసుగొండ ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎదుట విద్యార్థులు, విద్యార్థి సంఘాల నాయకులు పెద్దఎత్తున నినాదాలు చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఏఐఎఫ్‌డీఎస్ వరంగల్ జిల్లా ఉపాధ్యక్షుడు గూడా సాయిరాం మాట్లాడుతూ విద్యారంగ సమస్యల పరిష్కారంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. ప్రభుత్వ పాఠశాలల్లో కనీస మౌలిక వసతులు లేక విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, గురుకులాలు, సంక్షేమ వసతి గృహాలకు సొంత భవనాలు లేకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని అన్నారు. రాష్ట్రానికి ఇప్పటికీ పూర్తి స్థాయి విద్యాశాఖ మంత్రిని నియమించకపోవడం విచారకరమని పేర్కొన్నారు. ప్రైవేటు విద్యాసంస్థల్లో ఫీజుల నియంత్రణ చట్టాన్ని కచ్చితంగా అమలు చేయాలని, ప్రభుత్వ డిగ్రీ, జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయాలని, సమీకృత నివాస పాఠశాలలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయడంతో పాటు రెగ్యులర్ ఎంఈఓలు, డీఈఓలను నియమించాలని, విశ్వవిద్యాలయాల్లో మౌలిక సదుపాయాలను మెరుగుపరచాలని ప్రభుత్వాన్ని కోరారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని విద్యారంగ సమస్యలను యుద్ధప్రాతిపదికన పరిష్కరించాలని,



ప్రభుత్వ విద్యను బలోపేతం చేసే దిశగా తక్షణ చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సందీప్, వినయ్, వంశీ, రాకేష్, జ్యోతి, శిరీషతో పాటు ఏఐఎఫ్‌డీఎస్, వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

# విశిష్ట సేవలకు బీఎల్‌వో అరుణకు ఘన సన్మానం



వరంగల్, జులై 10 హైదరాబాద్ ఎస్టేట్:
గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ 15వ డివిజన్ పరిధిలోని గొర్రెకుంట 137వ పోలింగ్ కేంద్రం బీఎల్‌వో కోట అరుణను విశిష్ట సేవలకు గాను కాంగ్రెస్ నాయకులు ఘనంగా సన్మానించారు. ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమంలో భాగంగా నిరక్షరాస్యులైన సుమారు 500 మంది ఓటర్ల వివరాల డిజిటలైజేషన్, ధృవీకరణ ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేసినందుకు కాంగ్రెస్ 15వ డివిజన్ క్లస్టర్ ఇన్‌చార్జి ఎలగొండ ప్రవీణ్, డివిజన్ అధ్యక్షుడు కందుల అశోక్, గొర్రెకుంట మాజీ ఎంపీటీసీ పోలెపాక సుమన్ శాలువాతో సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా బీఎల్‌వోల సేవలు ఎన్నికల వ్యవస్థలో కీలకమని నాయకులు పేర్కొన్నారు. విధి నిర్వహణలో కోట అరుణ చూపిన అంకితభావం అభినందనీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో గీసుగొండ ఆర్‌ఐ పిట్టల సాంబయ్య, గ్రామస్థులు జన్ను పీటర్, ఇందరాగ్యం, జన్ను నర్సయ్య, మార సాగర్, కె. రాజేష్, బీఎల్‌వోలు రమాదేవి, పద్మ, నిర్మల తదితరులు పాల్గొని కోట అరుణకు శుభాకాంక్షలు తెలిపారు.

# అందరినీ కలుపుకొని కాంగ్రెస్‌ను బలోపేతం చేస్తా : కందుల అశోక్

## – 15వ డివిజన్ నూతన అధ్యక్షుడికి మొగిలిచర్ల కాంగ్రెస్ నాయకుల ఘన సన్మానం

వరంగల్, జూలై 10 హైదరాబాద్ ఎస్టేట్:
గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ 15వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన కందుల అశోక్‌కు మొగిలిచర్ల గ్రామ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు శుక్రవారం ఘనంగా సన్మానం నిర్వహించారు. ఈ సందర్భంగా కందుల అశోక్ మాట్లాడుతూ తనపై విశ్వాసం ఉంచి బాధ్యతలు అప్పగించిన పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి, వరంగల్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు ఎండి అయూబ్, జిల్లా ఉపాధ్యక్షుడు కొండేటి కొమరారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కొత్తపాత అనే తేడా లేకుండా ప్రతి నాయకుడు, కార్యకర్తను కలుపుకొని 15వ డివిజన్‌లో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు అంకితభావంతో పనిచేస్తానన్నారు. పార్టీ సిద్ధాంతాలు, ప్రజా సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై వచ్చే ప్రతి ఒక్కరికీ సముచిత ప్రాధాన్యం కల్పిస్తూ అందరి సహకారంతో ముందుకు సాగుతానని పేర్కొన్నారు. తనకు ఘన సన్మానం నిర్వహించిన మొగిలిచర్ల గ్రామ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు కొండేటి కొమరారెడ్డి, 15వ డివిజన్ కాంగ్రెస్ కార్పొరేటర్ అభ్యర్థి ఎలగొండ ప్రవీణ్, ఓబీసీ జిల్లా ఉపాధ్యక్షుడు కటకం సురేందర్, మొగిలిచర్ల మాజీ అధ్యక్షుడు బెజ్జాల కుమారస్వామి, మాజీ



సర్పంచ్ గణిపాక శ్రీనివాస్, పోతరాజు చేరాలు, మాజీ పీఏసీఎస్ డైరెక్టర్ పోషాల కిషన్, వనపర్తి కట్టస్వామి, కొత్తపల్లి కుమారస్వామి (జీప్ స్వామి), బుద్ధ శ్రీనివాస్, కుసురి యాదగిరి, బొట్టు శ్రీనివాస్, అన్న శ్రీనివాస్, మండ కోదండపాణి, బందెల రాజు, అల్లం క్రాంతికుమార్, ల్యాదల్ల నవీన్, కందుల రమేష్, రాజబోయిన రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రముఖుల సమక్షంలో నమిండ్ల క్లైమేట్ కుమార్తె నిశ్చితార్థ వేడుక



గీసుగొండ, జులై 10 హైదరాబాద్ ఎస్టేట్:
వరంగల్ జిల్లా గీసుగొండ మండలం గొర్రెకుంట గ్రామంలో ఎమ్మార్పీఎస్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు నమిండ్ల క్లైమేట్ కుమార్తె నిశ్చితార్థ వేడుక ఘనంగా నిర్వహించారు. ఈ శుభకార్యానికి రాష్ట్ర బీసీ నాయకుడు జాపర్తి కుమార్ గాడ్గే, మాజీ ఎంపీటీసీ పోలేపాక సుమన్, మాజీ సర్పంచ్ జన్ను రేణుక , కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ఎలగొండ ప్రవీణ్, బుర్ర కవిత హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, వధూవరుల దాంపత్య జీవితం సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యాలతో కళకళలాడాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా నమిండ్ల క్లైమేట్ అతిథులను ఆత్మీయంగా ఆహ్వానించి సత్కరించారు. అనంతరం అతిథులు కుటుంబ సభ్యులతో కలిసి శుభాకాంక్షలు తెలియజేస్తూ స్మారక చిత్రాలు దిగారు. కార్యక్రమంలో వరంగల్ జిల్లా జర్నలిస్టు సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు గట్ల శ్రీనివాస్, జిల్లా నాయకుడు సముద్రాల సురేష్‌తో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు, సామాజిక కార్యకర్తలు, గ్రామ పెద్దలు, బంధుమిత్రులు పాల్గొని నూతన జంటకు తమ ఆశీస్సులు అందించారు.

# గీసుగొండ ప్యాక్స్‌లో గోల్డ్ లోన్ కౌంటర్‌కు అధికారుల సానుకూల స్పందన

## – త్వరలో నిర్ణయానికి డీసీసీబీ సీఈవో వజీర్ సుల్తాన్ హామీ..

## – 1,200 మంది రైతులకు చేరువ కానున్న రుణ సేవలు

గీసుగొండ, జులై 10 హైదరాబాద్ ఎస్టేట్:
గీసుగొండ మండల రైతులకు, గ్రామీణ ప్రజలకు ఊరటనిచ్చే పరిణామం చోటుచేసుకుంది. గీసుగొండ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (ప్యాక్స్) కార్యాలయంలో గోల్డ్ లోన్ కౌంటర్ ఏర్పాటు చేయాలని కోరుతూ సంఘం పాలకవర్గం జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (డీసీసీబీ) సీఈవో వజీర్ సుల్తాన్, ఏజీఎం స్రవంతికి వినతిపత్రం సమర్పించింది. వినతిపత్రాన్ని పరిశీలించిన డీసీసీబీ సీఈవో వజీర్ సుల్తాన్, ఏజీఎం స్రవంతి సానుకూలంగా స్పందిస్తూ ప్రతిపాదనపై అతి త్వరలో నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రస్తుతం బంగారు రుణాల కోసం గీసుగొండ ప్రాంత రైతులు, ప్రజలు ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సి రావడంతో సమయం, రవాణా ఖర్చు పెరుగుతున్నాయి. ప్యాక్స్‌లో గోల్డ్ లోన్ కౌంటర్ ఏర్పాటుకు అనుమతి లభిస్తే 1,200 మంది సభ్య రైతులతో పాటు గీసుగొండ, పరిసర గ్రామాల ప్రజలు స్థానికంగానే బంగారు రుణ సేవలు పొందే అవకాశం కలుగుతుంది. దీంతో అత్యవసర వ్యవసాయ, కుటుంబ అవసరాలకు వేగంగా ఆర్థిక సాయం అందడంతో పాటు గ్రామీణ ప్రాంతాలకు బ్యాంకింగ్ సేవలు మరింత చేరువ కానున్నాయి. ఈ ప్రతిపాదనతో రైతులకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యమని ప్యాక్స్ అధ్యక్షుడు రడం శ్రీధర్, కార్యదర్శి కోల ప్రదీప్ తెలిపారు. అధికారుల



సానుకూల స్పందనతో గోల్డ్ లోన్ కౌంటర్ ఏర్పాటుపై రైతులు, సంఘ సభ్యులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# సింధూరప్రతాప్‌లకు మడే పూర్ణిమ ఆశీస్సులు

హన్మకొండ, జులై 10 హైదరాబాద్ ఎస్టేట్:
హనుమకొండలో జరిగిన సింధూరప్రతాప్‌ల వివాహ వేడుకకు ములుగు జిల్లా కాంగ్రెస్ నాయకురాలు మడే పూర్ణిమ, ఎస్సీఎస్టీ టీచర్స్ అసోసియేషన్ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మడే బిక్షపతి దంపతులు హాజరై



నూతన వధూవరులను ఆశీర్వదించారు. ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలం లక్ష్మీపురం గ్రామ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు దుప్పటి సుందరంభాగ్య దంపతుల కుమార్తె సింధూర వివాహం ప్రతాప్‌తో హనుమకొండలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మడే పూర్ణిమ, మడే బిక్షపతి దంపతులు నూతన వధూవరులకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రతాప్ వ్యవసాయ విస్తరణ అధికారిగా, సింధూర నర్సింగ్ సిబ్బందిగా విధులు నిర్వహిస్తూ ప్రజలకు సేవలందిస్తున్నారని పేర్కొన్నారు. తల్లిదండ్రుల ఆశయాలకు అనుగుణంగా నూతన దంపతులు ఉన్నత స్థాయికి ఎదిగి సమాజంలో మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. వారి వైవాహిక జీవితం నిండు నూరేళ్లు సుఖసంతోషాలతో కొనసాగాలని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో ఎస్సీఎస్టీ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు గొర్రె విజయభాస్కర్, ములుగు జిల్లా అధ్యక్షులు రవీందర్, హనుమకొండ జిల్లా గౌరవ అధ్యక్షులు కుమారస్వామి, ఉపాధ్యాయులు, కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు పాల్గొన్నారు.

# ప్రజాపాలనలో రైతు సంక్షేమమే లక్ష్యం: లక్ష్మారెడ్డి

## – 9రోజుల్లో రూ.9వేల కోట్ల రైతు భరోసా నిధులు విడుదల

## – వానాకాలం సాగు పెట్టుబడిగా అన్నదాతకు సాయం: కేఎల్ఆర్

( హైదరాబాద్ ఎస్టేట్ రంగారెడ్డి ప్రతినిధి కృష్ణ చారి జులై 10:)
రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కిచ్చన్న గారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ..ముఖ్యమంత్రి రేవంత్ కి కృతజ్ఞతలు ఖరీఫ్ సీజన్ లో అన్నదాతలకు పెట్టుబడి సాయంగా విడతల వారీగా తెలంగాణ ప్రభుత్వం రైతు భరోసా నిధులను విడుదల చేస్తుందని మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్చార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి అన్నారు.ఖమ్మం జిల్లాలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతు భరోసా నిధులను మరో విడత విడుదల చేస్తారని చెప్పారు.9 రోజుల్లో రూ.9 వేల కోట్ల పెట్టుబడి సాయం కింద నిధులను విడుదల చేసిన ఏకైక ప్రభుత్వమని కేఎల్ఆర్ కొనియాడారు.దీని వల్ల 73 లక్షల మంది రైతులకు మేలు జరగ్గా... కోటిన్నర ఎకరాలకు పెట్టుబడి సాయం అందినట్లు అవుతుందని రైతుబిడ్డ లక్ష్మారెడ్డి చెప్పారు.

విపక్షాలు విమర్శలు మానుకోవాలి: కేఎల్ఆర్

ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం ఏడాదికి రూ.12వేలు రైతు భరోసా ఇస్తున్నామని కేఎల్ఆర్ అన్నారు. విపక్షాలు విమర్శలు మానుకోని రైతు ప్రభుత్వానికి, సీఎం రేవంత్ రెడ్డి ప్రజాపాలనకు సహకరించాలని కోరారు.

ఖరీఫ్– రబీ సీజన్ వారీగా కర్షకుల ఖాతాల్లో విడతల వారీగా ఎకరాకు రూ.6వేలు పెట్టుబడి సాయం జమ చేస్తున్నామని చెప్పారు.

ఏకకాలంలో రుణమాఫీ, సబ్సిడి, పెట్టుబడి సాయం అందించిన ఘనత కాంగ్రెస్



ప్రభుత్వానిదేనని కిచ్చెన్న గుర్తు చేశారు.రైతు భరోసా రాకుంటే ఏం చేయాలి బ్యాంక్ అకౌంట్ ను సరి చూసుకోండి. లేదా ఏఈఓను సంప్రదించాలి. రెవెన్యు రికార్డుల్లో పట్టాదారు పాస్ బుక్ వివరాలను చెక్ చేసుకోవాలని విజ్ఞప్తి.

# ఎంపీ రవిచంద్రకు కేటీఆర్ అభినందనలు

## బీఆర్ఎస్ రాజ్యసభ ఫ్లోర్ లీడర్‌గా నియామకం

హైదరాబాద్, జులై 10 హైదరాబాద్ ఎస్టేట్:
బీఆర్ఎస్ రాజ్యసభ ఫ్లోర్ లీడర్‌గా, పార్లమెంటరీ పార్టీ నాయకుడిగా నియమితులైన రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్రను పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అభినందించారు. ఈ సందర్భంగా ఎంపీ రవిచంద్ర కేటీఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి తన నియామకానికి సంబంధించిన విషయాలను తెలియజేశారు. అనంతరం కేటీఆర్ పుష్పగుచ్ఛం అందించి ఆయనకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. రాజ్యసభలో బీఆర్ఎస్ పార్టీ తరపున సమర్థవంతమైన పాత్ర పోషిస్తూ, ప్రజా సమస్యలను



బలంగా ప్రస్తావించాలని కేటీఆర్ ఆకాంక్షించారు. పార్టీ విధానాలు, ప్రజా ప్రయోజనాల కోసం రవిచంద్ర తన బాధ్యతలను విజయవంతంగా నిర్వర్తిస్తారనే విశ్వాసం వ్యక్తం చేశారు. రాజ్యసభలో పార్టీ నాయకత్వ బాధ్యతలు చేపట్టిన సందర్భంగా ఎంపీ రవిచంద్రకు పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అభినందనలు తెలియజేస్తున్నారు.

RNI No Tel / 2012 /4241
ప్రతి అక్షరం.. ప్రజల పక్షం..
హైద్రాబాద్ ఎస్టేట్
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER
తెలుగు దిన పత్రిక
hyderabadestate.co.in
11 శనివారం జూలై 2026

# వినయ్ భాస్కర్‌కు కార్యకర్తలే బలం..

## సతీష్ రెడ్డి, క్రిశాంక్ పిలుపు

## గులాబీ జెండా మోసిన వారిని గుండెల్లో పెట్టుకుంటా..

## ప్రజల పక్షాన పోరాడుతా : దాస్యం వినయ్ భాస్కర్



హన్మకొండ, జులై 10 హైదరాబాద్ ఎస్టేట్:
భారత రాష్ట్ర సమితి వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శ్రేణులు, బూత్ స్థాయి ఏజెంట్లకు సభ్యత్వ నమోదు, ఓటరు సవరణ ప్రక్రియ, సోషల్ మీడియాపై ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని శుక్రవారం స్నేహనగర్‌లోని ఎస్వీ కన్వెన్షన్ హాల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ప్రభుత్వ చీఫ్ విప్, మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్ మాట్లాడుతూ.. కష్టకాలంలో తనకు, పార్టీకి అండగా నిలిచిన కార్యకర్తలను ఎప్పటికీ మరువబోనని అన్నారు. గులాబీ జెండాను మోసిన ప్రతి కార్యకర్తకు అండగా ఉంటానని, కేసులు, బెదిరింపులు, విమర్శలకు భయపడకుండా ప్రజా సమస్యలపై పోరాటం కొనసాగిస్తానని తెలిపారు. ఓటరు సవరణ ప్రక్రియలో బూత్ స్థాయి ఏజెంట్లు కీలక పాత్ర పోషించాలని, క్షేత్రస్థాయిలో ప్రజలకు అవసరమైన సహాయ సహకారాలు అందించాలని కోరారు. రెడ్కో మాజీ చైర్మన్, నియోజకవర్గ ఇన్‌చార్జ్ వై. సతీష్ రెడ్డి మాట్లాడుతూ.. బీఎల్ఏలు బీఎల్వోలతో సమన్వయం చేసుకుంటూ ఓటరు సవరణ ప్రక్రియలో చురుకుగా పాల్గొనాలని సూచించారు. చివరి రోజుల వరకు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండి ప్రజలకు సహకరించాలని అన్నారు. బీఆర్ఎస్ సోషల్ మీడియా రాష్ట్ర కన్వీనర్, టీఎస్ఎండీసీ మాజీ చైర్మన్ మన్నె క్రిశాంక్ మాట్లాడుతూ.. సోషల్ మీడియా వేదికగా పార్టీ చేసిన మంచిని, ప్రజల కోసం చేపట్టిన కార్యక్రమాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. దాస్యం వినయ్ భాస్కర్ ప్రజా సమస్యలపై చేస్తున్న పోరాటాలను ప్రజలకు చేరవేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, బీఎల్ఏలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కందుకూరు పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన ఫ్యూచర్ సిటీ సీపీ తరుణ్ జోషి

## ప్రజలకు మెరుగైన పోలీసింగ్ అందించడమే లక్ష్యం : సీపీ తరుణ్ జోషి





హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి జూలై 10:-
రంగారెడ్డి జిల్లా కందుకూరు పోలీస్ స్టేషన్‌ను ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనర్ డా. తరుణ్ జోషి, ఐపీఎస్ శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ భవనం, పరిసర ప్రాంతాలు, ఆవరణ పరిశుభ్రత, భద్రతా ఏర్పాట్లు, కేసుల రికార్డుల నిర్వహణను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం స్టేషన్ ఆవరణలో మొక్కను నాటి, పర్యావరణ పరిరక్షణ ప్రతి పోలీసు ఉద్యోగి బాధ్యతగా భావించి మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని సూచించారు. పోలీస్ సిబ్బందితో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ప్రజలకు పోలీసుల ఉనికి స్పష్టంగా కనిపించేలా విజిబుల్ పోలీసింగ్ సమర్థవంతంగా అమలు చేయాలని ఆదేశించారు. చట్టాలపై, సైబర్ నేరాలపై, రోడ్డు భద్రతపై ప్రజల్లో నిరంతరం అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవడంతో పాటు పెండింగ్‌లో ఉన్న గ్రేవ్ (యూఐ) కేసుల దర్యాప్తును వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. పోలీస్ స్టేషన్ రికార్డులను క్రమబద్ధంగా నిర్వహిస్తూ సీసీటీఎన్ఎస్ మరియు ఈ-సాక్షి అప్లికేషన్‌ల వినియోగాన్ని మరింత సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. సైబర్ నేరాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించి, బాధితులకు తక్షణ సేవలు అందించేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. ఈ తనిఖీ కార్యక్రమంలో మహేశ్వరం జోన్ డీసీపీ కె. నారాయణ రెడ్డి, ఐపీఎస్, మహేశ్వరం ఏసీపీ ఎస్. జనకి రెడ్డి, కందుకూరు ఎస్‌హెచ్‌ఓ హెచ్. వెంకటేశ్వర్లు తదితర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# బస్తీ దవాఖానల్లో వైద్య సేవలు మరింత మెరుగుపరచాలి

## : డీఎంహెచ్‌వో డా. స్వర్ణ కుమారి



హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి జులై 10:-
రంగారెడ్డి జిల్లా: బస్తీ దవాఖానల్లో ప్రజలకు నాణ్యమైన, సకాలంలో వైద్య సేవలు అందేలా అన్ని చర్యలు తీసుకోవాలని జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖాధికారి (డీఎంహెచ్‌వో) డా. స్వర్ణ కుమారి వైద్య సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం ఆమె పాండురంగ నగర్, బుద్వేల్ బస్తీ దవాఖానలను ఆకస్మికంగా తనిఖీ చేసి అక్కడ అందుతున్న వైద్య సేవలను పరిశీలించారు.
ఈ సందర్భంగా ఓపీ సేవలు, రోగుల నమోదు ప్రక్రియ, మందుల లభ్యత, ప్రయోగశాల సేవలు, గర్భిణీలు, చిన్నారులకు అందిస్తున్న ఆరోగ్య సేవలు, టీకాల కార్యక్రమం, వైద్య సిబ్బంది హాజరు, ఆస్పత్రుల పరిశుభ్రత, బయోమెడికల్ వ్యర్థాల నిర్వహణ తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. రోగులను మర్యాదపూర్వకంగా ఆదరించి నాణ్యమైన చికిత్స అందించాలని, అవసరమైన మందులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆమె సూచించారు. వర్షాకాలం నేపథ్యంలో డెంగ్యూ, మలేరియా, వైరల్ జ్వరాలు వంటి సీజనల్ వ్యాధులపై ప్రత్యేక అప్రమత్తతతో పనిచేయాలని, లక్షణాలతో వచ్చే రోగులను వెంటనే గుర్తించి తగిన చికిత్స అందించాలని వైద్య సిబ్బందికి ఆదేశించారు. ప్రభుత్వ ఆరోగ్య కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయడంతో పాటు బస్తీ దవాఖానల్లో పరిశుభ్రమైన వాతావరణాన్ని కొనసాగిస్తూ ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించాలని డా. స్వర్ణ కుమారి సూచించారు. ఈ తనిఖీల్లో సంబంధిత వైద్య అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# బీసీ 7 న్యూస్, టీవీ 7 టీ న్యూస్ చానల్స్ ప్రారంభం

## బీసీ రిజర్వేషన్లపై ప్రధానమంత్రి అఖిలపక్ష సమావేశం నిర్వహించాలి




హైదరాబాద్, జూలై 10: బీసీ రిజర్వేషన్లపై అఖిల పక్ష సమావేశం నిర్వహించాలని వివిధ పార్టీల, ప్రజా సంఘాల, బీసీ సంఘాల బీసీ నేతలు ప్రధానమంత్రి నరేంద్రమోదీకి విజ్ఞప్తి చేశారు. శుక్రవారం నారాయణగూడలో బీసీ 7 న్యూస్, టీవీ 7 టీ న్యూస్ చానల్స్ ను పలువురు ప్రముఖులు ప్రారంభించారు. ఈ సందర్భంగా చానల్స్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో పలువురు వక్తలు మాట్లాడారు. ఈ సందర్భంగా మహాత్మ జ్యోతిరావు పూలే విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు వి. హనుమంతరావు, మాజీ మంత్రి వి.శ్రీనివాస్ గౌడ్, మండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి, బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, రాష్ట్ర ప్రధానకార్యదర్శి తంగెళ్లమూడి నందగోపాల్, విద్యార్థి జేఏసీ చైర్మన్ వేముల రామకృష్ణ, ఉదయ్ నేత, శివమ్మ, తారకేశ్వరి, రూప, శివకుమార్, ఆంజనేయులు, వేణు, గోవింద్ తదితరులు ప్రసంగించారు. దేశ జనాభాలో 56శాతం బీసీలు ఉన్నప్పటికి సరైన న్యాయం జరగడం లేదని వారు అన్నారు. 78 సంవత్సరాలుగా బీసీలకు అన్ని రంగాల్లో అన్యాయం జరుగుతూనే ఉందని పేర్కొన్నారు. బీసీలందరూ సంఘటితంగా ఉద్యమించి బీసీలకు రాజ్యాంగం కల్పించిన హక్కులను సాధించుకోవాలని పిలుపునిచ్చారు. దేశంలో ఏకులానికి, మతానికి లేని ఆంక్షలు కేవలం బీసీలకు మాత్రమే ఎందుకు ఉన్నాయని వారు ప్రశ్నించారు. జనాభా దామాషా ప్రకారం... బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు.

# ఎస్ఐఆర్ గడువు పెంచాలని ఈసీకి బీఆర్ఎస్ విజ్ఞప్తి

## పారదర్శక ఓటరు జాబితాలే లక్ష్యం : ఎంపీ రవిచంద్ర





ఢిల్లీ, జులై 10 హైదరాబాద్ ఎస్టేట్:
ఓటరు జాబితాల ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను మరింత సమర్థవంతంగా, పారదర్శకంగా పూర్తి చేసేందుకు అదనపు సమయం అవసరమని బీఆర్ఎస్ ప్రతినిధి బృందం కేంద్ర ఎన్నికల సంఘాన్ని కోరింది. ఎస్ఐఆర్ ప్రక్రియకు మరో ఒకటి నుంచి రెండు నెలల గడువు పొడిగించాలని విజ్ఞప్తి చేసింది. బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ నాయకుడు, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, లోక్‌సభ మాజీ సభ్యులు బోయినపల్లి వినోద్ కుమార్, పార్టీ ప్రధాన కార్యదర్శి సోమ భరత్ కుమార్‌లతో కూడిన ప్రతినిధి బృందం శుక్రవారం ఢిల్లీలోని నిర్వాచన్ సదన్‌లో కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ జ్ఞానేష్ కుమార్, కమిషనర్లు డాక్టర్ సుఖ్‌బీర్ సింగ్ సంధూ, డాక్టర్ వివేక్ జోషిలను కలిసి ఎస్ఐఆర్ ప్రక్రియపై పలు సూచనలు చేసింది. ఈ సందర్భంగా ఎంపీ రవిచంద్ర మాట్లాడుతూ.. ప్రస్తుతం ఎస్ఐఆర్ ప్రక్రియ ఆశించిన వేగంతో కొనసాగడం లేదని, ఇప్పటివరకు 5 నుంచి 10 శాతం వరకు మాత్రమే పూర్తయిందని తెలిపారు. బూత్ స్థాయిలో అవసరమైన సిబ్బంది, ఫారాలు, సాంకేతిక సౌకర్యాల కొరతను ఎన్నికల సంఘం దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. ఓటరు జాబితాల ప్రక్షాళనలో డూప్లికేట్ ఓట్ల తొలగింపు, కొత్తగా 18 సంవత్సరాలు నిండిన వారి నమోదు, అర్హులైన ప్రతి ఒక్కరి ఓటు హక్కు పరిరక్షణకు సమగ్ర పరిశీలన అవసరమని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా ప్రతి భారత పౌరుడికి ఒకే ఓటు ఉండాలన్నదే బీఆర్ఎస్ అధ్యక్షులు కేసీఆర్ ఆలోచన అని ఎంపీ రవిచంద్ర తెలిపారు. తెలంగాణతో సరిహద్దు కలిగిన మహారాష్ట్ర, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, ఒడిశా రాష్ట్రాల్లో ఒకే వ్యక్తికి రెండు చోట్ల ఓట్లు నమోదైన సందర్భాలు ఉన్నాయని, ఇలాంటి లోపాలను ఎస్ఐఆర్ ద్వారా సరిదిద్దాల్సిన అవసరం ఉందన్నారు. తెలంగాణలోని పలు జిల్లాల్లో గణనీయ సంఖ్యలో డూప్లికేట్ ఓట్లు ఉన్నట్లు తమ పార్టీ అధ్యయనంలో గుర్తించిందని, సంబంధిత వివరాలను ఎన్నికల సంఘానికి నివేదిక రూపంలో అందజేశామని వెల్లడించారు. లోక్‌సభ మాజీ సభ్యులు బోయినపల్లి వినోద్ కుమార్ మాట్లాడుతూ.. ఎస్ఐఆర్ విజయవంతం కావాలంటే బూత్ లెవల్ అధికారుల పనితీరు మరింత మెరుగుపడాల్సిన అవసరం ఉందన్నారు. కొన్ని ప్రాంతాల్లో బీఎల్ఓలకు ప్రక్రియపై పూర్తి అవగాహన లేకపోవడంతో పాటు అవసరమైన ఫారాలు అందుబాటులో లేని పరిస్థితులు ఉన్నాయని తెలిపారు. సాంకేతిక పరిజ్ఞానం వినియోగంతో ఓటరు జాబితాలను మరింత పారదర్శకంగా రూపొందించవచ్చని, ఆధార్ ఆధారిత ధ్రువీకరణ ద్వారా డూప్లికేట్ నమోదులను గుర్తించడం సులభమవుతుందని సూచించారు. అయితే ఆధార్‌ను తప్పనిసరి చేయడం సాధ్యం కాదని, స్వచ్ఛందంగా అందించే వివరాల ఆధారంగా ప్రక్రియను మరింత మెరుగుపరచవచ్చని తెలిపారు. ఎస్ఐఆర్ ప్రక్రియ రాజకీయాలకు అతీతంగా, పూర్తిగా నిష్పాక్షికంగా కొనసాగి ప్రతి అర్హుడైన పౌరుడికి న్యాయం జరిగేలా చూడాలని బీఆర్ఎస్ తరఫున ఎన్నికల సంఘాన్ని కోరినట్లు ఎంపీ రవిచంద్ర తెలిపారు. తమ సూచనలను ఎన్నికల సంఘం సానుకూలంగా స్వీకరించిందని, గడువు పొడిగింపుపై పరిస్థితులను పరిశీలించి నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చిందని చెప్పారు.

# మహేశ్వరం నియోజకవర్గంలో వందల సంఖ్యలో హిందూ అమ్మాయిల గల్లంతు కేసులు – శ్రీరాములు అందెల


## ఎస్.ఐ.ఆర్ ప్రక్రియ, రోహింగ్యాల అంశాలపై హైదరాబాద్ సిపి సజ్జనర్ కి వినతిపత్రం అందజేసిన శ్రీరాములు అందెల



( హైదరాబాద్ ఎస్టేట్ రంగారెడ్డి ప్రతినిధి కృష్ణ చారి జూలై. 10:)
మహేశ్వరం నియోజకవర్గంలో (ఎస్.ఆర్ఐ) ప్రక్రియ, అక్రమంగా నివసిస్తున్న రోహింగ్యాలు మరియు నియోజకవర్గ వ్యాప్తంగా పలు పోలీస్ స్టేషన్ల పరిధిలో హిందూ అమ్మాయిల గల్లంత కేసుల అంశాలపై ఈరోజు రంగారెడ్డి జిల్లా బిజెపి అధ్యక్షులు పంతంగి రాజ్ భూపాల్ గౌడ్ మరియు భాగ్యనగర్ జిల్లా బిజెపి అధ్యక్షులు నిరంజన్ యాదవ్ తో కలిసి మహేశ్వరం నియోజకవర్గ బిజెపి ఇన్చార్జ్ అందెల శ్రీరాములు హైదరాబాద్ సిపి సజ్జనర్ ని బంజారాహిల్స్ లోని కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ లో కలిసి వినతిపత్రం అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా శ్రీరాములు మాట్లాడుతూ సమస్యాత్మక బూత్‌లలో ఎస్ఐఆర్ ప్రక్రియ నిర్వహణలో భాగంగా బీఎల్ఓలు, బీఎల్ఏలకు తగిన భద్రత కల్పించి ప్రక్రియ ప్రశాంతంగా, పారదర్శకంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరినట్లు తెలిపారు. అదేవిధంగా నియోజకవర్గ పరిధిలో అక్రమంగా నివసిస్తున్న రోహింగ్యాల స్థావరాలపై సమగ్ర తనిఖీలు నిర్వహించి అవసరమైన చర్యలు చేపట్టాలని సీపీకి విజ్ఞప్తి చేసినట్లు చెప్పారు. మహేశ్వరం నియోజకవర్గంలోని పలు పోలీస్ స్టేషన్ల పరిధిలో హిందూ యువతుల గల్లంతుకు సంబంధించి కేసులు నమోదయ్యాయని, ఈ కేసులపై వేగవంతమైన మరియు సమగ్ర దర్యాప్తు చేపట్టి బాధిత కుటుంబాలకు న్యాయం జరిగేలా చూడాలని సీపీని కోరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి దేవేందర్ రెడ్డి బిజెపి మరియు బీజేవైఎం నాయకులు పాల్గొన్నారు.

# రంగారెడ్డిలో ఎం ఎస్ ఎం ఈ అభివృద్ధికి ఎస్‌బీఐపరిశ్రమల శాఖ జతకట్టు

## పారిశ్రామికవేత్తలకు రుణాలపై ఎస్‌బీఐడీఐసీ సమన్వయం



హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి జులై 10:-
రంగారెడ్డి జిల్లాలో సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల (మీఎస్ఎంఈ) అభివృద్ధిని వేగవంతం చేసేందుకు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ), పరిశ్రమల శాఖ సంయుక్తంగా పనిచేయాలని నిర్ణయించాయి. ఎస్‌బీఐ ఆహ్వానం మేరకు జిల్లా పరిశ్రమల కేంద్రం (డీఐసీ) జనరల్ మేనేజర్, పరిశ్రమల శాఖ జాయింట్ డైరెక్టర్ శ్రీమతి శ్రీలక్ష్మి శుక్రవారం సికింద్రాబాద్‌లోని ఎస్‌బీఐ అడ్మినిస్ట్రేటివ్ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా డిప్యూటీ జనరల్ మేనేజర్ మాధన్ స్వామినాథన్ ఆమెకు స్వాగతం పలికారు. అనంతరం జరిగిన సమావేశంలో జిల్లాలోని మీఎస్ఎంఈ యూనిట్లు, స్టార్టప్‌లు, కొత్త పారిశ్రామికవేత్తలకు సకాలంలో రుణాలు అందించేందుకు ఎస్‌బీఐ, పరిశ్రమల శాఖ పరస్పర సమన్వయంతో పనిచేయాలని నిర్ణయించారు. మాధన్ స్వామినాథన్ మాట్లాడుతూ, అర్హులైన పారిశ్రామికవేత్తలకు అవసరమైన ఆర్థిక సహాయాన్ని అందించడంలో ఎస్‌బీఐ ఎల్లప్పుడూ ముందుంటుందని, కొత్త పరిశ్రమల స్థాపనకు పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు.
శ్రీమతి శ్రీలక్ష్మి మాట్లాడుతూ, రంగారెడ్డి జిల్లాలో పారిశ్రామికాభివృద్ధి, స్వయం ఉపాధి ప్రోత్సాహం, ప్రభుత్వ పారిశ్రామిక పథకాల సమర్థ అమలుకు ఎస్‌బీఐతో సమన్వయాన్ని మరింత బలోపేతం చేస్తామని పేర్కొన్నారు. ఈ సమావేశం జిల్లా లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ (ఎల్‌డీఎం) సుశీల్‌కుమార్ సమన్వయంతో నిర్వహించారు.

RNI No Tel / 2012 /4241
హైదరాబాద్ ఎస్టేట్
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER
తెలుగు దిన పత్రిక
hyderabadestate.co.in
11 శనివారం జూలై 2026

# కాంగ్రెస్ బలోపేతమే లక్ష్యం

## డీసీసీ అధ్యక్షుడు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి



హన్మకొండ, జులై 10 హైదరాబాద్ ఎస్టేట్:
కాంగ్రెస్ పార్టీని క్షేత్రస్థాయి నుంచి మరింత పటిష్టం చేయడమే లక్ష్యంగా ప్రతి నాయకుడు, కార్యకర్త ప్రజలతో మమేకమై పనిచేయాలని హనుమకొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి పిలుపునిచ్చారు. టీపీసీసీ ఆదేశాల మేరకు పార్టీ సంస్థాగత బలోపేతం, క్షేత్రస్థాయి కార్యాచరణ, ఏఐసీసీ, టీపీసీసీకి సమర్పించాల్సిన నివేదికలపై చర్చించేందుకు హనుమకొండ డీసీసీ కార్యాలయంలో జిల్లా కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో ముఖ్య సమావేశం నిర్వహించారు. ఇనగాల వెంకట్రామ్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జిల్లా నాయకులు, మండల కాంగ్రెస్ అధ్యక్షులు, వర్ధన్నపేట నియోజకవర్గ పరిధిలోని డివిజన్ అధ్యక్షులు పాల్గొన్నారు. ఈ సమావేశానికి టీపీసీసీ జిల్లా సమన్వయకర్త శ్రీనివాస్ గౌడ్, టీపీసీసీ అధికార ప్రతినిధి కూచన రవళి, టీపీసీసీ శిక్షకుడు పులి అనిల్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఇనగాల వెంకట్రామ్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి మండలం, ప్రతి డివిజన్ పరిధిలో పార్టీ కార్యక్రమాలను ప్రణాళికాబద్ధంగా నిర్వహించాలని సూచించారు. ప్రజల సమస్యలను తెలుసుకుని పరిష్కారానికి కృషి చేస్తూ, పార్టీని ప్రజల్లో మరింత బలంగా నిలబెట్టేందుకు నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని కోరారు. ఏఐసీసీ, టీపీసీసీ సూచించిన కార్యక్రమాలను బాధ్యతతో నిర్వహించి, నివేదికలను సకాలంలో అందించాలని తెలిపారు. పార్టీ క్రమశిక్షణకు కట్టుబడి అధిష్టానం ఆదేశాలను పాటిస్తూ ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. అనంతరం నిర్వహించిన 'చరక' కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు ఉత్సాహంగా పాల్గొన్నారు.

# బెల్లంపల్లి, మందమర్రి ఏరియాల 24వ త్రైపాక్షిక సేఫ్టీ సమీక్షా సమావేశం.

హైదరాబాద్ ఎస్టేట్ జులై, 2026
మంచిర్యాల జిల్లా మందమర్రి పట్టణంలోని ఇల్లందు క్లబ్‌లో శుక్రవారం బెల్లంపల్లి మరియు మందమర్రి ఏరియాల 24వ వార్షిక త్రైపాక్షిక భద్రత సమీక్షా సమావేశం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన సింగరేణి డైరెక్టర్ (ప్లానింగ్ అండ్ ప్రాజెక్ట్) కె. వెంకటేశ్వర్లు, డీఎంఎస్ అధికారులతో కలిసి ఇల్లందు క్లబ్ ఆవరణంలో మొక్కలు నాటారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సమావేశంలో డీఎంఎస్ (మైనింగ్) సాగేష్ కుమార్, డీడీఎంఎస్ (మైనింగ్) దీపక్ కుమార్ ప్రభాకర్, డీడీఎంఎస్ (ఎలక్ట్రికల్) కోమల్ చౌదరి, మందమర్రి ఏరియా జీఎం ఎన్ రాధాకృష్ణ, బెల్లంపల్లి ఏరియా జీఎం ఎం. రమేష్, కార్పోరేట్ సేఫ్టీ జీఎం సాయిబాబు, మందమర్రి ఏరియా ఏఐటీయూసీ గుర్తింపు సంఘం బ్రాంచి సెక్రెటరీ సలేంద్ర సత్యనారాయణ, గోలేటి ఏరియా ~ాxఖజ బ్రాంచ్ సెక్రటరీ యస్ . తిరుపతి తదితరులు పాల్గొన్నారు. సింగరేణి మరియు డీజీఎంఎస్ గీతాల ప్రదర్శన అనంతరం అందరితో రక్షణ ప్రతిజ్ఞ చేయించారు. గని ప్రమాదాలలో మృతిచెందిన అమర కార్మికులకు సంతాప సూచకంగా రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళులు అర్పించారు. ప్రమాదాల నివారణే ధ్యేయం కావాలి: ఈ సందర్భంగా డీఎంఎస్ (మైనింగ్) శ్రీ సాగేష్ కుమార్ మాట్లాడుతూ, ప్రతి ఉద్యోగి భూగర్భ గనులు మరియు వివిధ విభాగాలలో రక్షణ సూత్రాలను తప్పనిసరిగా పాటిస్తూ ఉత్పత్తి సాధించాలని సూచించారు. మందమర్రి ఏరియాలో ప్రమాదాల శాతాన్ని 'జీరో పర్సంటేజ్' కు తీసుకురావడానికి ప్రతి ఒక్కరూ కంకణబద్ధులై కృషి చేయాలన్నారు. ఓపెన్ కాస్ట్, భూగర్భ గనుల్లో ప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, అత్యంత కీలకమైన ప్రదేశాలలో అనుభవజ్ఞులైన, నిష్ణాతులైన ఉద్యోగులను మాత్రమే విధుల్లో నియమించాలని స్పష్టం చేశారు. అలాగే కార్మికుల వ్యక్తిగత ఆరోగ్య పరిరక్షణపై కూడా యాజమాన్యం ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని హితవు పలికారు. సింగరేణి డైరెక్టర్ (ప్లానింగ్ అండ్ ప్రాజెక్ట్) కె వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, సింగరేణిలో రక్షణ చర్యలపై యాజమాన్యం ఎక్కడా రాజీ పడకుండా, పకడ్బందీగా వ్యవహరిస్తోందని తెలిపారు. ఉద్యోగులు, అధికారులు సమన్వయంతో, కలిసికట్టుగా రక్షణ సూత్రాలు పాటిస్తూనే నిర్దేశిత ఉత్పత్తి లక్ష్యాలను విజయవంతంగా సాధిస్తున్నారని కొనియాడారు. కార్పొరేట్ సేఫ్టీ జీఎం సాయిబాబా మాట్లాడుతూ, సింగరేణి వ్యాప్తంగా రక్షణపై ఉద్యోగులకు, అధికారులకు ఎప్పటికప్పుడు అవగాహన సదస్సులు కల్పిస్తున్నామని చెప్పారు. ప్రతి గనిలో పనిచేస్తున్న చివరి ఉద్యోగి వరకు 'సేఫ్టీ ఆపరేటింగ్ ప్రొసీజర్స్' (రక్షణ నియమావళి) స్పష్టంగా తెలిసేలా పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు.





సమావేశంలో పాల్గొన్న కార్మిక సంఘాల నాయకులు గనుల్లో రక్షణ ఏర్పాట్లపై తాము తీసుకుంటున్న చొరవను డీజీఎంఎస్ అధికారులకు వివరించారు. గనుల్లో కార్మికుల భద్రతను మరింత మెరుగుపరచడం కోసం అధునాతన యంత్రాలు, నూతన సాంకేతికతను (New Technology) పెద్ద ఎత్తున వినియోగించుకోవాలని యాజమాన్యానికి సూచించారు. దీనిపై సింగరేణి అధికారులు సానుకూలంగా స్పందిస్తూ రక్షణ చర్యల్లో కార్మిక సంఘాలు ఇచ్చిన విలువైన సూచనలను ఖచ్చితంగా పరిగణనలోకి తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమం లో బెల్లంపల్లి రీజియన్ జీఎం సేఫ్టీ రఘు కుమార్, జీఎం (రెస్క్యూ) శ్రీనివాస్ రెడ్డి, జమీూా× ప్రెసిడెంట్ (మందమర్రి) ఎస్. రమేష్, జమీూా× ప్రెసిడెంట్ (బెల్లంపల్లి) ఎం . నరేందర్, ఏరియా ఏజెంట్లు, గని మేనేజర్లు, వివిధ విభాగాల అధిపతులు, సేఫ్టీ ఆఫీసర్లు, యూనియన్ ప్రతినిధులు, వర్క్ మెన్ ఇన్స్పెక్టర్లు మరియు పెద్ద సంఖ్యలో అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

## నేతాజీ నగర్ బస్తీలో స్థానికంగా గొడవలు దిగుతూ న్యూసెన్స్ చేస్తున్న వ్యక్తి పైన అబిడ్స్ పోలీసులు కేసు నమోదు



హైదరాబాద్ , జూలై 10: ఇంటి నుండి కారును బయటకు తీస్తుండగా ఎదురు ఇంటిలో లో ఉన్న వ్యక్తి తో తలెత్తిన గొడవ దాడికి దారితీసిన ఘటన శుక్రవారం ఆబిడ్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఈ ఘటనకు సంబంధించి ఆబిడ్స్ ఇన్స్పెక్టర్ కే. పరశు రాం తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఆబిడ్స్ చిరాగ్ అలీ లేన్ బస్తికి చెందిన కే. సాయి అక్షిత్ రెడ్డి తన తాత ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడని, అతని డిశ్చార్జ్ చేసి ఇంటికి తీసుకువచ్చేందుకు ఇంట్లో ఉన్న కారును బయటకు తీస్తుండగా ఎదురుగా ఉండే నేతాజీ నగర్ కు చెందిన మహమ్మద్ అబ్దుల్ అహ్మద్ ముల్ది (19) అలియాస్ నేహాల్, అతని తల్లి యాస్మిన్ నేహాల్ ముల్ది కారుకు అడ్డుగా వచ్చి సాయి అక్షిత్ రెడ్డి పై దాడికి యత్నించారు. అంతటితో ఆగకుండా అసభ్య పదజాలంతో దూషించడంతోపాటు బెదిరింపులకు పాల్పడ్డారు. వెంటనే సాయి అక్షత్ రెడ్డి 100 కు పోలీసులకు ఫోన్ చేసి సమాచారం అందించారు. ఆబిడ్స్ పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని గొడవకు దిగిన మహమ్మద్ అబ్దుల్ అహ్మద్ ముల్దీ అదుపులోకి తీసుకొని ఆబిడ్స్ పోలీస్ స్టేషన్ కు తరలించారు. పోలీసుల విచారణలో నేరాన్ని అంగీకరించడంతో మహమ్మద్ అబ్దుల్ అహ్మద్ పై కేసు నమోదు చేసి న్యాయస్థానానికి తరలించారు. అదేవిధంగా అతని తల్లి యాస్మిన్ నేహాల్ ముల్దీ కూడా స్థానిక బస్తీలో పలువురితో గొడవలకు దిగుతున్న సందర్భాలు అనేకం ఉన్నాయని తన దృష్టికి వచ్చిందని ఇన్స్పెక్టర్ కె. పరుశురాం తెలిపారు. ఆమెను పద్ధతి మార్చుకోమని అందరితో కలిసిమెలిసి ఉండాలని సూచించారు. కాదు, కుదురదు అని అంటే చట్టపరమైన చర్యలు తప్పవని, అవసరమైతే జైలుకు పంపుతామని ఇన్స్పెక్టర్ ఆమెని హెచ్చరించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

# కోహెడలో రూ.47.03 కోట్ల చేపల ఎగుమతి మార్కెట్‌కు శంకుస్థాపన

## ముదిరాజుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం: మంత్రి వాకిటి శ్రీహరి





హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి జూలై 10:-
రంగారెడ్డి జిల్లా, కోహెడ: జాతీయ మత్స్య రైతుల దినోత్సవాన్ని పురస్కరించుకుని అబ్దుల్లాపూర్‌మెట్ మండలం కోహెడలో రూ.47.03 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనున్న ఎగుమతి ఆధారిత హోల్‌సేల్ చేపల మార్కెట్‌కు రాష్ట్ర పశుసంవర్ధక, పాడి పారిశ్రామికాభివృద్ధి, మత్స్య, యువజన సర్వీసులు & క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, ఫిషరీస్ డైరెక్టర్ నిఖిల, ఫ్రూట్ మార్కెట్ చైర్మన్ చిలుక మధు, అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి, మత్స్యశాఖ అధికారులు, మత్స్యకారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ ముదిరాజుల అభివృద్ధి కోసం మంత్రి పదవికే కాదు, అవసరమైతే ప్రాణం ఇవ్వడానికైనా సిద్ధమని అన్నారు. ఎలాంటి అడ్డంకులు వచ్చినా మత్స్యకారుల సంక్షేమం కోసం ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తుందని స్పష్టం చేశారు. కోహెడలో నిర్మించనున్న ఈ కేంద్రం తెలంగాణ మత్స్యరంగ చరిత్రలో కీలక మైలురాయిగా నిలుస్తుందని, సముద్రతీర ప్రాంతం కాకుండా దేశంలోనే తొలిసారిగా అంతర్గత రాష్ట్రంలో ఆధునిక మంచినీటి చేపల ఎగుమతుల కేంద్రం ఏర్పాటవడం గర్వకారణమని పేర్కొన్నారు. ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో చేపపిల్లల పేరుతో చెరువుల్లో మట్టిని విక్రయించారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం మత్స్యకారుల అభివృద్ధి కోసం కోహెడలో విలువైన ప్రభుత్వ భూమిని కేటాయించి ఈ ప్రాజెక్టును తీసుకొచ్చిందన్నారు. ఇదే ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమని చెప్పారు. ఈ ప్రాంతానికి మరో రూ.50 కోట్ల అభివృద్ధి ప్రాజెక్టు మంజూరు చేయాలని మంత్రిని కోరగా, సానుకూలంగా స్పందించిన మంత్రి ఆ దిశగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

## టీఎస్‌జేయూ ఆధ్వర్యంలో 'సే నో టు డ్రగ్స్' 2కే ర్యాలీ

### హైదరాబాద్ ఎస్టేట్ న్యూస్ ప్రతినిధి హనుమకొండ

### కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి చేతుల మీదుగా పోస్టర్ ఆవిష్కరణ




హనుమకొండ, జూలై 10 ( ): మాదక ద్రవ్యాల నిర్మూలనపై సమాజంలో అవగాహన కల్పించేందుకు తెలంగాణ స్టేట్ జర్నలిస్ట్స్ యూనియన్ (టీఎస్‌జేయూ) రాష్ట్ర అధ్యక్షులు నారగౌని పురుషోత్తం ఆదేశాల మేరకు
హనుమకొండ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 23న "సే నో టు డ్రగ్స్" నినాదంతో 2కే అవగాహన ర్యాలీ నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ యువతను మాదక ద్రవ్యాల బారిన పడకుండా కాపాడేందుకు అవగాహన కార్యక్రమాలు ఎంతో అవసరమని పేర్కొన్నారు. సమాజ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని టీఎస్‌జేయూ చేపడుతున్న ఈ కార్యక్రమాన్ని అభినందిస్తూ, ర్యాలీ విజయవంతం కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో టీఎస్‌జేయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తోకల అనిల్ కుమార్, హన్మకొండ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్, జిల్లా ప్రధాన కార్యదర్శి హరికృష్ణ, జిల్లా కోశాధికారి సల్మాన్ ఖాన్, జిల్లా ప్రచార కార్యదర్శి అజీమ్ మాట్లాడుతూ మాదక ద్రవ్యాల నిర్మూలన ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. యువత, విద్యార్థులు, ప్రజలు, స్వచ్ఛంద సంస్థలు, జర్నలిస్టులు అధిక సంఖ్యలో పాల్గొని ర్యాలీని విజయవంతం చేయాలని వారు కోరారు.

# అరెస్టైన విద్యార్థి నాయకులకు వీసీకే యూత్ మద్దతు

## శాంతియుత నిరసనలను అరెస్టులతో అడ్డుకోలేరు : అంబాల అనిల్ కుమార్






హన్మకొండ, జులై 10 హైదరాబాద్ ఎస్టేట్:
హనుమకొండ అశోక జంక్షన్‌లో డీఎస్‌ఏ, టీఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన విద్యార్థి సంఘాల బంద్ కార్యక్రమంలో పలువురు విద్యార్థి సంఘాల నాయకులను పోలీసులు అరెస్ట్ చేసి హనుమకొండ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. విద్యార్థి సంఘాల నాయకుల అరెస్టు విషయం తెలుసుకున్న వీసీకే యూత్ రాష్ట్ర అధ్యక్షులు అంబాల అనిల్ కుమార్ వెంటనే హనుమకొండ పోలీస్ స్టేషన్‌కు చేరుకుని అరెస్ట్ అయిన విద్యార్థి నాయకులను పరామర్శించి సంఘీభావం తెలిపారు. విద్యార్థుల పోరాటానికి వీసీకే యూత్ సంపూర్ణ మద్దతు ఉంటుందని ప్రకటించారు. ఈ సందర్భంగా అంబాల అనిల్ కుమార్ మాట్లాడుతూ.. విద్యార్థుల సమస్యలపై ప్రజాస్వామిక పద్ధతిలో శాంతియుతంగా నిరసన తెలుపుతున్న నాయకులను అరెస్ట్ చేయడం సరికాదని అన్నారు. అరెస్టులు, నిర్బంధాలతో న్యాయమైన ఉద్యమాలను ఆపలేరని పేర్కొన్నారు. విద్యార్థుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుని సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని ఆయన కోరారు. ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కును గౌరవించాలని సూచించారు. ఈ సందర్భంగా హనుమకొండ పోలీస్ స్టేషన్‌లో ఉన్న అరెస్ట్ అయిన విద్యార్థి సంఘాల నాయకులకు అంబాల అనిల్ కుమార్ మనోధైర్యం కల్పించారు. డీఎస్‌ఏ, టీఎస్‌ఎఫ్ విద్యార్థి నాయకుల పోరాటానికి వీసీకే యూత్ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు.

# హరీష్ రావుకు కాంగ్రెస్ బంపర్ ఆఫర్




హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి ఇరిగి అశోక్
మాజీ మంత్రి హరీష్ రావుకు టీ కాంగ్రెస్ బంపర్ ఆఫర్ ఇచ్చింది. పదేళ్లపాటు మంత్రిగా పనిచేసిన హరీష్ రావు రాష్ట్రానికి చేసిన అభివృద్ధి ఏమిటో చెప్పాలని టిపిసిసి చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధిని చూసి టిఆర్ఎస్ నేతలు అసహనానికి గురవుతున్నారని ఒకవేళ హరీష్ రావు కాంగ్రెస్ పార్టీలో చేరాలని కోరితే రాజకీయ వ్యవహారాల కమిటీతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని వ్యాఖ్యానించారు. ఇవాళ హైదరాబాదులోని గాంధీభవన్లో ఆయన మీడియాతో మాట్లాడుతూ. ప్రాంతీయ పార్టీ అయినా టిఆర్ఎస్ కు రూ.1.400 కోట్ల నిధులు ఎలా వచ్చాయో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో నీటి వ్యవహారాలపై ప్రశ్నలు లేవనెత్తుతున్న బిజెపి ఎంపీ ఈటల రాజేందర్ గతంలో టిఆర్ఎస్ ప్రభుత్వంలో ఆర్థిక మంత్రిగా పనిచేసిన విషయాన్ని గుర్తు చేశారు. కడియం శ్రీహరి కొండ సురేఖ తుంగతుర్తి పంచాయతీ అంశాలపై వివరణ కోసం సచిన్ సవంత్ జగ్గారెడ్డి లను అభ్యర్థులుగా నియమించామని తెలిపారు. వారి నివేదిక ఆధారంగానే పార్టీ క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈనెల 15న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఏఐసీసీ కార్యదర్శి మీనాక్షి నటరాజన్ తో సమావేశమై కార్పొరేషన్ పదవుల భర్తీపై తుది నిర్ణయం తీసుకుంటామని మహేష్ కుమార్ గౌడ్ వెల్లడించారు

RNI No Tel / 2012 /4241
హైద్రాబాద్ ఎస్టేట్
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER
తెలుగు దిన పత్రిక
hyderabadestate.co.in
11 శనివారం జూలై 2026

# జర్నలిస్టులకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించాలి

## – ఆర్టీసీ, రవాణా అధికారులకు టీడబ్ల్యూజేఎఫ్ వినతి

హైదరాబాద్ ఎస్టేట్ న్యూస్ ప్రతినిధి జూలై 10:
జర్నలిస్టులకు రాష్ట్రవ్యాప్తంగా ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సదుపాయం కల్పించాలని కోరుతూ శుక్రవారం జర్నలిస్టులు రాష్ట్రవ్యాప్తంగా ఆర్టీసీ, రవాణా అధికారులకు వినతి పత్రాలు సమర్పించారు. తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్(టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు అన్ని జిల్లా కేంద్రాల్లో జర్నలిస్టులు ఆర్టీసీ ఉన్నతాధికారులకు, డిపో మేనేజర్లకు విజ్ఞాపన పత్రాలు అందజేశారు. హుస్నాబాద్ లో రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కు, హైదరాబాద్ సచివాలయంలో రాష్ట్ర రవాణా శాఖ అదనపు కార్యదర్శి సునీతాదేవీ లకు ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య, ప్రధాన కార్యదర్శి తన్నీరు శ్రీనివాస్ తదితరులు
వినతిపత్రాలు సమర్పించారు. అనంతరం వారు ఆర్టీసీ క్రాస్ రోడ్ లోని బస్ భవన్ లో ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్, వైస్ ఛైర్మెన్ వై.నాగిరెడ్డికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య మాట్లాడుతూ...రాష్ట్రవ్యాప్తంగా జర్నలిస్టులకు ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. జర్నలిస్టులు ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా సేవలందిస్తున్నారని, తెలంగాణ లో మహిళలకు ఉచిత ప్రయాణ సదుపాయం కల్పించిన ప్రభుత్వం పరిమిత సంఖ్యలో ఉన్న జర్నలిస్టులకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించకపోవడం బాధాకరమని అన్నారు. ప్రభుత్వం, ఆర్టీసీ సంస్థ చాలా ఏళ్ళుగా జర్నలిస్టులకు ఆర్టీసీ బస్సుల్లో 1/3 రాయితీ పై ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్నప్పటికీ పేరుకే 1/3 కానీ జర్నలిస్టుల నుంచి 50 శాతం చార్జీలు వసూలు చేస్తున్నారని అన్నారు. వార్తల సేకరణకు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే జర్నలిస్టులకు ప్రయాణ చార్జీలు భారమవుతుందని,దీనిని దృష్టిలో పెట్టుకొని జర్నలిస్టులకు రాష్ట్ర వ్యాప్తంగా(తెలంగాణ ఎర్త్ వైడ్)



ఉచిత ప్రయాణం, ఇతర రాష్ట్రాలకు 1/3 రాయితీ సదుపాయం కల్పించాలని మామిడి సోమయ్య డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తన్నీరు శ్రీనివాస్, నేషనల్ కౌన్సిల్ మెంబర్ రామారావు, పద్మనాభరావు, హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు వి. రవికుమార్, నాయకులు ఆర్. శ్రీనివాస్ గౌడ్, ఎం. రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

# భాగ్యనగర బోనాలకు ముహూర్తం ఫిక్స్

హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి
ఇరిగి అశోక్




హైదరాబాదులో ప్రతి ఏటా నిర్వహించే ఆషాడ బోనాల ఉత్సవాలు ఇక్కడ లౌకిక స్ఫూర్తిని గంగా జమున ప్రత్యేకతను చాటుతామని అటవీ పర్యావరణ దేవదాయ ధర్మదాయ శాఖ మంత్రి కొండ సురేఖ అన్నారు. జంట నగరాల్లో బోనాల నిర్వహణ ముస్లిం పండుగల సందర్భంలో హిందూ ముస్లిం సమాజంలో ప్రదర్శించే పరస్పర సహకారం యావద్దేశానికి గొప్ప సందేశాన్ని ఇస్తుందని ఆమె పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఇవాళ హైదరాబాదులోనీ గోల్కొండ కోటలో గల జగదాంబిక అమ్మవారి దేవస్థానం లో మంత్రి కొండ సురేఖ ఆధ్వర్యంలో బోనాల ఉత్సవాల సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకు ఏర్పాటుపై మంత్రి దిశా నిర్దేశం చేశారు. జూలై 16 నుంచి ప్రారంభమయ్యే ఆషాడ బోనాల ఉత్సవాల్లో తొలి బోనాన్ని సాంప్రదాయం ప్రకారం గోల్కొండ జగదాంబిక మహంకాళి అమ్మవారికి సమర్పిస్తారని మంత్రి తెలిపారు. ఆగస్టు 13 వరకు జరిగే ఈ ఉత్సవాలకు లక్షలాది మంది భక్తులు హాజరయ్యే అవకాశం ఉన్నందున అన్ని ప్రభుత్వ శాఖలు సంపూర్ణ సమన్వయంతో పనిచేసి పకడ్బందీ ఏర్పాటు చేయాలని ఆదేశించారు అనంతరం ఆషాడ బోనాల జాతర పోస్టర్ విడుదల చేశారు

# ఓటర్ల జాబితా సవరణ వేగవంతం చేయాలి

## – జూలై 24లోగా డిజిటైజేషన్ పూర్తి చేయాలని ఈసీ ఆదేశం

హైదరాబాద్ స్టేట్ ప్రతినిధి జూలై 10:–
రంగారెడ్డి జిల్లా, ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో భాగంగా ఎన్యూమరేషన్ ఫారాల డిజిటైజేషన్ ప్రక్రియను వేగవంతం చేసి ఈ నెల 24వ తేదీలోగా పూర్తి చేయాలని భారత ఎన్నికల సంఘం డిప్యూటీ ఎన్నికల కమిషనర్ పవన్ కుమార్ శర్మ రాష్ట్ర, జిల్లా ఎన్నికల అధికారులను ఆదేశించారు. శుక్రవారం న్యూఢిల్లీ నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో తెలంగాణ ప్రధాన ఎన్నికల అధికారి, జిల్లా ఎన్నికల అధికారులు, కలెక్టర్లతో ఆయన సమీక్ష నిర్వహించారు.ఎన్నికల జాబితాలో పారదర్శకత ప్రజాస్వామ్యానికి ఎంతో కీలకమని పేర్కొన్న ఆయన, అర్హులైన ప్రతి భారత పౌరుడు ఓటరుగా నమోదు కావడానికి అవకాశం కల్పించాలని సూచించారు. ఇంటింటి సర్వేలు, బూత్ స్థాయి అధికారుల పనితీరు, ఓటరు పేర్ల నమోదు, సవరణ, తొలగింపు ప్రక్రియలను నిబంధనల ప్రకారం ఖచ్చితత్వంతో





నిర్వహించాలని ఆదేశించారు. ఎలాంటి విచారణ లేకుండా ఓటరు పేరును జాబితా నుంచి తొలగించరాదని స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి మాట్లాడుతూ ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ 99.6 శాతం పూర్తయిందని, డిజిటైజేషన్ 21.94 శాతం పూర్తైందని తెలిపారు. మిగిలిన ఫారాల పంపిణీని పూర్తిచేసి డిజిటైజేషన్‌ను వేగవంతం చేస్తామని చెప్పారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సి. నారాయణ రెడ్డి మాట్లాడుతూ



భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమాన్ని ఎలాంటి పొరపాట్లు లేకుండా నిర్వహిస్తున్నామని తెలిపారు. మ్యాపింగ్ చేసిన డేటా ఆధారంగా ఫారాలను పరిశీలించి డిజిటైజేషన్ ప్రక్రియను వేగవంతం చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ సమావేశంలో డీఆర్ఓ శారద, ఆర్డీఓలు, జోనల్ కమిషనర్లు, ఎన్నికల శాఖ అధికారులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ డిజిటలైజేషన్ వేగవంతం చేయాలి : కలెక్టర్ నారాయణరెడ్డి



హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి జూలై 10:–
రంగారెడ్డి జిల్లా ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) డిజిటలైజేషన్ ప్రక్రియను నిర్దేశిత గడువులోగా నాణ్యతతో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ సి. నారాయణరెడ్డి అధికారులను ఆదేశించారు. శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఈఆర్ఓలు, ఏఈఆర్ఓలు, జోనల్ కమిషనర్లు, ఎన్నికల శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. బీఎల్ఓలు క్షేత్రస్థాయిలో సేకరించిన వివరాలను ఎలాంటి పొరపాట్లు లేకుండా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని, ప్రతి దరఖాస్తును నిబంధనల ప్రకారం పరిశీలించాలని సూచించారు. ఇంటింటికీ వెళ్లి సమాచార సేకరణ పూర్తి చేసి, వెంటనే డిజిటలైజేషన్ చేపట్టాలని ఆదేశించారు. సోమవారం నాటికి జిల్లాలో కనీసం 60 శాతం డిజిటలైజేషన్ పూర్తి చేసేలా ప్రత్యేక కార్యాచరణ అమలు చేయాలని, పెండింగ్ దరఖాస్తులను వేగంగా పరిష్కరించి ప్రతిరోజూ పురోగతిని సమీక్షించాలని కలెక్టర్ పేర్కొన్నారు. డేటా నమోదు సమయంలో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ, శాఖల మధ్య సమన్వయంతో ప్రక్రియను గడువులోగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. సమావేశంలో ఎన్నికల శాఖ అధికారులు, తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు తదితరులు పాల్గొన్నారు.

# ఒకే బిల్లుతో మున్సిపల్ బకాయిల చెల్లింపు.. ప్రజలకు మరింత సౌలభ్యం

హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి జూలై 10:–
పట్టణ ప్రాంతాల్లో ప్రజలకు మున్సిపల్ సేవలను మరింత సులభంగా, పారదర్శకంగా అందించేందుకు తెలంగాణ ప్రభుత్వం ‘బిల్ వన్‘ పేరుతో కొత్త సేవను ప్రారంభించింది. మున్సిపల్ పరిపాలన శాఖ ఆధ్వర్యంలో అమలులోకి వచ్చిన ఈ విధానం ద్వారా ఆస్తి పన్ను, నీటి వినియోగ రుసుములు, వ్యాపార అనుమతి రుసుము వంటి అన్ని మున్సిపల్ బకాయిలను ఒకే బిల్లుతో చెల్లించే అవకాశం కల్పించింది. ఈ విధానం ద్వారా వేర్వేరు బిల్లులు చెల్లించాల్సిన అవసరం లేకుండా ఒకేసారి అన్ని బకాయిలను చెల్లించవచ్చు. ప్రతి ఆస్తికి కేటాయించిన ఆస్తి పన్ను గుర్తింపు సంఖ్య ఆధారంగా బిల్లులు రూపొందించబడతాయి. ఒకే యజమాని పేరుతో ఉన్న బహుళ ఆస్తుల బకాయిలను కూడా ఒకే బిల్లులో చూపించే విధానాన్ని ప్రభుత్వం అమలు చేసింది. ప్రజల ఆర్థిక సౌలభ్యాన్ని దృష్టిలో ఉంచుకుని బకాయిలను విడతల వారీగా చెల్లించే



అవకాశాన్ని కల్పించడంతో పాటు, కొంత మొత్తాన్ని ముందుగా చెల్లించి మిగిలిన మొత్తాన్ని తర్వాత చెల్లించే వెసులుబాటును కూడా అందుబాటులోకి తీసుకొచ్చింది.
అలాగే మున్సిపల్ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి బిల్లుల వివరాలు అందించనున్నారు. రాష్ట్ర ఈ–మున్సిపల్ వెబ్‌సైట్ ద్వారా కూడా రోజులో ఏ సమయంలోనైనా



ఆన్‌లైన్‌లో బిల్లులు చెల్లించవచ్చు. ‘బిల్ వన్‘ సేవ అమలుతో పౌరులకు సమయం, శ్రమ ఆదా కావడంతో పాటు మున్సిపల్ ఆదాయ వసూళ్లు కూడా వేగవంతం కానున్నాయి. పట్టణ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ మున్సిపల్ బకాయిలను సకాలంలో చెల్లించాలని ప్రభుత్వం కోరింది.

# ప్రభుత్వం నిషేధించిన క్యాట్ ఫిష్ ను పెంపకం చేస్తున్న వ్యక్తుల పైన అధికారులు చర్యలు తీసుకోవాలి.

## గిరిజన సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి శీను నాయక్

హైదరాబాద్ ఎస్టేట్ న్యూస్ ప్రతినిధి చిలకలూరిపేట



భారత ప్రభుత్వం నిషేధించిన ‘క్యాట్ ఫిష్‘ పెంపకం చిలకలూరిపేట మండలంలోని బొప్పూడి శివార్లలో వ్యవసాయ భూములను తవ్వేసి సుమారు 8 భారీ చెరువులు ఏర్పాటు చేసి
యధేచ్ఛగా ప్రమాదకరమైన క్యాట్ ఫిష్‌లను పెంచుతూన్నారు. దీనిపైన జిల్లా అధికారులు చర్యలు తీసుకోవాలని (సిపిఐ)గిరిజన సమాఖ్య రాష్ట్ర సహాయ కార్యదర్శి బి. శ్రీను నాయక్ అన్నారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ క్యాట్ ఫిష్ కు మేతగా కుళ్ళిన కోళ్లు, వ్యర్థాలు, జంతు కళేబరాలు పెడుతున్నారు. ఈ క్యాట్ ఫిష్ పెంపకం వల్ల జరిగే అనర్థాలను గుర్తించిన భారత ప్రభుత్వం దీనిపై ఎప్పుడో ఉక్కుపాదం మోపిందన్నారు. ఈ చేపలను తింటే మనుషులకు జీర్ణవ్యవస్థ పూర్తిగా నాశనమై, క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధుల బారిన పడే ప్రమాదమని ఆరోగ్యశాఖ నిపుణులు హెచ్చరిస్తున్నారు. సంబంధిత శాఖ అధికారులు దృష్టి సారించి దీని వెనుకాల ఎవరున్నారో తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనధికారికంగా తవ్విన చెరువులను పూడ్చివేసి ప్రజల ఆరోగ్యాలను అధికారులు కాపాడాలన్నారు.

# విద్యారంగాన్ని విస్మరిస్తున్న రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి పతనం తప్పదు

## – హన్మకొండ లో వామపక్ష విద్యార్థి సంఘాల ర్యాలీ, రాస్తారోకో

## – హన్మకొండ జిల్లాలో విద్యాసంస్థల బంద్ విజయవంతం




హైద్రాబాద్ ఎస్టేట్ న్యూస్ /హన్మకొండ ప్రతినిధి :
తెలంగాణ రాష్ట్రంలో విద్యా రంగాన్ని నిర్లక్ష్యం చేస్తూ, విద్య రంగాభివృద్ధిని పూర్తిగా విస్మరిస్తున్న రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి పతనం తప్పదని వామపక్ష విద్యార్థి సంఘాల నేతలు హెచ్చరించారు. విద్యా రంగ సమస్యలు పరిష్కరించడం చేతగాక పోతే తక్షణమే రేవంత్ రెడ్డి ప్రభుత్వం గద్దె దిగాలని డిమాండ్ చేశారు. శుక్రవారం హన్మకొండ జిల్లా కేంద్రంలో వామపక్ష విద్యార్థి సంఘాలు నిర్వహించిన రాష్ట్రవ్యాప్త విద్యాసంస్థల బంద్ పూర్తిగా విజయవంతం అయింది. జిల్లాలో ప్రభుత్వ విద్యాసంస్థల్లో తరగతులు బహిష్కరించి బంద్ నిర్వహించగా,ప్రైవేటు విద్యాసంస్థలు స్వచ్ఛందంగా సంపూర్ణ బంద్ పాటించాయి. ఈ సందర్భంగా వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు కాకతీయ యూనివర్సిటీ ఎస్.డి.ఎల్.సి.ఇ. జంక్షన్ నుండి వందలాది మంది విద్యార్థులతో బైక్ ర్యాలీ నిర్వహించిన అనంతరం విద్యార్థులతో భారీ ర్యాలీ తీసి,మర్కాజి స్కూల్ సెంటర్ లోని మెయిన్ రోడ్డు పై గంట సేపు రాస్తారోకో నిర్వహించగా పోలీసులు వచ్చి విద్యార్థి సంఘాల నాయకులను అరెస్టు చేసి బలవంతంగా హన్మకొండ స్టేషన్ కు తరలించడం జరిగింది. ఈ సందర్భంగా వామపక్ష విద్యార్థి సంఘాల జిల్లా బాధ్యులు భాష బోయిన సంతోష్ (ఏఐఎస్ఎఫ్), మంద శ్రీకాంత్ (ఎస్ఎఫ్ఐ), బి.నరసింహారావు(పి.డి.ఎస్.యు), మాస్ సావిత్రి (ఎ.ఐ.ఎఫ్.డి.ఎస్), మద్రి మహేష్ (పి.డి.ఎస్.యు), రోహిత్ (ఏ.ఐ.ఎస్.బి), వెంకటేష్ (ఎ.ఐ.డి.ఎస్.ఓ) లు మాట్లాడుతూ రాష్ట్రంలో రేవంత్ రెడ్డి పాలనలో విద్యారంగం పూర్తిగా బ్రష్టు పట్టిపోతున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మూడు సంవత్సరాలుగా తెలంగాణ రాష్ట్రానికి కనీసం విద్యాశాఖ మంత్రిని నియమించకపోవడం విద్యారంగం పట్ల ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనం అన్నారు. రాష్ట్రంలో 27 వేల ప్రభుత్వ పాఠశాలల మూసివేత ఆలోచనను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే విరమకోని, ప్రభుత్వ విద్యా సంస్థలను బలోపేతం చేయాలని, ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఫీజులను నియంత్రిస్తూ సమగ్ర చట్టాన్ని రూపొందించాలని, తక్షణమే పెండింగ్ లో ఉన్న 9వేల కోట్ల రూపాయల స్కాలర్ షిప్, ఫీజు రియంబర్స్మెంట్, బెస్ట్ అవైలబుల్ స్కీం బకాయిలు విడుదల చేయాలని, తెలంగాణ రాష్ట్రానికి విద్యాశాఖ మంత్రిని నియమించాలని, విద్యార్థులందరికీ ఉచిత బస్పత్ సౌకర్యం కల్పించాలని, ఇంటర్, డిగ్రీ కాలేజీలలో మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయాలని, ప్రభుత్వ విద్యా సంస్థల్లో మౌలిక వసతులు కల్పించి, ఖాళీగా ఉన్న టీచింగ్ నాన్ టీచింగ్ పోస్టులను భర్తీ చేయాలని, ఎస్సీ ఎస్టీ బిసి ఎస్ఎంఎస్ హాస్టల్స్ కు సొంత భవనాలు నిర్మించాలని, కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు తెలంగాణ విద్యార్థి లోకానికి ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేకపోతే భవిష్యత్తులో అన్ని విద్యార్థి సంఘాలు సంఘటితమై పెద్ద ఎత్తున ఉద్యమించి రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు స్టాలిన్, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు ఉట్కూరీ ప్రణీత్,పి.డి.ఎస్.యు జిల్లా నాయకులు వంగేటీ మోహన్,ఎ.ఐ.ఎస్.బి జిల్లా నాయకులు మిస్బా, తాజుద్దీన్, సమీర్,పి.డి.ఎస్.యు. జిల్లా నాయకులు వంశీ, కార్తీక్, ఏ.ఐ.డి.ఎస్.ఓ. జిల్లా నాయకులు మధు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

RNI No Tel / 2012 /4241
హైదరాబాద్ ఎస్టేట్
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER
తెలుగు దిన పత్రిక
hyderabadestate.co.in



# ఆరుట్లలో భక్తి వెల్లువ... అయ్యప్ప స్వామి ప్రాణ ప్రతిష్ఠ వైభవం

హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి జులై 10:- రంగారెడ్డి జిల్లా మంచాల మండలం ఆరుట్ల గ్రామం శుక్రవారం భక్తి పారవశ్యంతో కళకళలాడింది. గ్రామంలోని అయ్యప్ప స్వామి ఆలయంలో స్వామివారి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ మహోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్ఛారణలు, ప్రత్యేక హోమాలు, పూజా కార్యక్రమాల నడుమ జరిగిన ఈ మహోత్సవం భక్తులను ఆధ్యాత్మిక అనుభూతికి గురిచేసింది.

ఈ కార్యక్రమానికి ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్రెడ్డి రంగారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై అయ్యప్ప స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి ఆశీస్సులు పొందారు. ఆలయ అభివృద్ధికి గ్రామస్తులు చేస్తున్న కృషిని ఆయన అభినందిస్తూ, ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు సమాజంలో ఐక్యత, సాంస్కృతిక విలువలను మరింత బలోపేతం చేస్తాయని





పేర్కొన్నారు. ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా ఆలయాన్ని విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించగా, ఆలయ ప్రాంగణం భక్తులతో కిక్కిరిసిపోయింది. ఆరుట్లతో పాటు పరిసర గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో తరలివచ్చిన అయ్యప్ప భక్తులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. భక్తి గీతాలు, మంగళ వాయిద్యాలు, ఆధ్యాత్మిక వాతావరణం కార్యక్రమానికి మరింత శోభను చేకూర్చాయి.

మహోత్సవం అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు, అన్నప్రసాదాన్ని పంపిణీ చేశారు. గ్రామ ప్రజల సహకారంతో విజయవంతంగా నిర్వహించిన ఈ వేడుక ఆరుట్ల గ్రామంలో చిరస్మరణీయ ఆధ్యాత్మిక ఉత్సవంగా నిలిచింది.

# రైతు భరోసా.. రైతులకు భరోసా

### వరంగల్ జిల్లాలో రూ.152.53 కోట్ల రైతు భరోసా నిధుల జమ

### ఏడీఏ జి. నర్సింగం వెల్లడి





గీసుగొండ, జులై 10 హైదరాబాద్ ఎస్టేట్: రైతులకు అండగా నిలిచే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు భరోసా పథకం ద్వారా వరంగల్ జిల్లాలో భారీగా నిధులు రైతుల ఖాతాల్లో జమ అయ్యాయని వర్ధన్నపేట వ్యవసాయ డివిజన్ ఏడీఏ జి. నర్సింగం తెలిపారు. ఖమ్మం జిల్లా చింతకాని మండలంలో రెండు రోజుల పాటు నిర్వహించిన రైతు ఆశీర్వాద సభ-2026 ముగింపు కార్యక్రమం శుక్రవారం ఘనంగా ముగిసింది. వానాకాలం-2026 రైతు భరోసా నిధుల విడుదల కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన ఈ సభకు ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కొనాయమాకుల రైతు వేదికలో సభ ప్రత్యక్ష ప్రసారాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏడీఏ జి. నర్సింగం మాట్లాడుతూ.. వరంగల్ జిల్లాలో ఇప్పటివరకు 1,58,282 మంది రైతుల ఖాతాల్లో రూ.152.53 కోట్ల రైతు భరోసా నిధులు జమ అయ్యాయని వెల్లడించారు. వానాకాలం-2026కు సంబంధించి రైతు భరోసా నిధుల విడుదల ప్రక్రియ పూర్తయిందని తెలిపారు. వర్ధన్నపేట వ్యవసాయ డివిజన్ పరిధిలో 81,907 మంది రైతులకు రూ.82.8 కోట్లు, గీసుగొండ మండలంలో 13,054 మంది రైతులకు రూ.12.9 కోట్లు నేరుగా రైతుల ఖాతాల్లో జమ చేసినట్లు ఏడీఏ వివరించారు. ప్రస్తుత ఎల్ నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు నెలకొనే అవకాశం ఉన్నందున రైతులు తక్కువ నీటితో సాగయ్యే అపరాలు, కూరగాయల సాగుపై దృష్టి సారించాలని సూచించారు. వరి సాగు చేయదలిచిన రైతులు ఆరుతడి పద్ధతిలో నేరుగా విత్తుకోవాలని తెలిపారు. ఇప్పటికే సాగు చేసిన పంటల్లో నీటి ఎద్దడిని ఎదుర్కొనేందుకు గొడ్డు సాళ్లు ఏర్పాటు చేసుకోవాలని, అవసరమైతే యూరియాను ద్రవరూపంలో పిచికారీ చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గీసుగొండ మండల వ్యవసాయ అధికారి పి. హరి ప్రసాద్ బాబు, వరంగల్ వ్యవసాయ అధికారి ఎన్. రవీందర్, ఉద్యాన అధికారి మానస, వ్యవసాయ విస్తరణ అధికారులు కావ్య, స్మిత, రాజేష్, ప్రవల్లిక, ఎన్ఎఫ్ఎస్ఎం రైతు ప్రతినిధి టీ. వీరన్న, రైతు నాయకులు చాడ కొమురారెడ్డి, దాడి శివ, కొనాయమాకుల గ్రామ ఉపసర్పంచ్, వార్డు సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

# తెలంగాణ ఎరుకల ఉద్యమకారులను గుర్తించాలి.

### తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కమిటీ చైర్మన్ కేశవరావు గారికి విజ్ఞప్తి.

### తెలంగాణ ఆదివాసి ఎరుకల సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్. కోనేటి నరసింహ

హైదరాబాద్ ఎస్టేట్ న్యూస్ ప్రతినిధి ఎల్బీనగర్ ఈరోజు హైదరాబాద్ ఎల్బీనగర్ లో తెలంగాణ ఆదివాసి ఎరుకల సంఘం ఎల్బీనగర్ అధ్యక్షుడు. ఉంద్రాత రవి ఆధ్వర్యంలో ముఖ్య నాయకుల సమావేశం జరిగినది. దీనికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్.కోనేటి నరసింహ పాల్గొన్నారు.ఈ సమావేశం అనంతరం విలేకరుల సమావేశం ఏర్పాటు చేయడం జరిగిందిూూ.రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కోనేటి నరసింహ మాట్లాడుతూ. ఇటీవల కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ ఉద్యమకారులకు గుర్తింపు కమిటీ. గౌరవనీయులు కేశవరావు గారిని చైర్మన్గా నిర్ణయించడం జరిగినది. ఈ కమిటీ అన్ని కులాలుగా తెలంగాణ ఉద్యమకారులను గుర్తిస్తట్టుగా కమిటీ వేయడం జరిగినది.ఈ కమిటీలు ఎరకల వారికి ప్రాధాన్యత లేకపోవడం ఎరకల వారిని కించపరిచినట్టుగా రాష్ట్ర ఎరుకల ప్రజలు భావిస్తున్నాం . అట్లాగే తెలంగాణ ఉద్యమంలో అన్ని జిల్లాల వారిగా తెలంగాణ ఉద్యమంలో ప్రజా సంఘాల ఝుషి తోటి ఎరకల సంఘాలు కూడా ఉద్యమకారుల భాగస్వాములై. వంటావార్పు. మెలన్ మార్చ్. మలిదశ. ఉద్యమంలో. రాస్తారోకోలు పోలీసులు లాటి చార్జీలు. లబ్బర్ బ్లోట్లతోటి. ఎరుకల





వారు తెలంగాణ ఉద్యమంలో అన్ని జిల్లాల్లో పాల్గొని తెలంగాణ సాధించుకున్నాము. గౌరవనీయులు తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కమిటీ చైర్మన్ గారు అన్ని జిల్లాలలో ఎరుకల ఉద్యమకారులు గుర్తించి న్యాయం చేయాలని ప్రభుత్వానికి డిమాండ్ చేస్తున్నాము. అట్లాగే తెలంగాణ ఏర్పడ్డాక.ఖజ=. మాజీ ముఖ్యమంత్రివర్యులు ప్రభుత్వం ఎరుకల వారిని గుర్తించి. ఎరుకల నాంచారమ్మ జాతరను ప్రభుత్వం చేత జాతర నడిపించినది . నిజాంపేటలో ఎరకల ఆత్మగౌరవం ఎకరం భూమి ఇచ్చి భవనం కట్టించినది. ఎలకల వారికి అన్ని ప్రాంతాలలో రాజకీయాలలో ప్రాధాన్యత కల్పించినది. అట్లాగే కాంగ్రెస్ ప్రభుత్వం మూడు సంవత్సరాలు అయినా. కానీ. చేవెళ్ల డిక్లరేషన్లు.ఏకలవ్య కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని 500 కోట్లు కేటాయిస్తామని ప్రకటించినది ఇంతవరకు ఏకలవ్య పాలకవర్గం ఏర్పాటు చేయకపోవడం సిగ్గుచేటు. సీఎం రేవంత్ రెడ్డి గారు తక్షణమే ఏకలవ్య కార్పొరేషన్ పాలకవర్గం ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాం ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కోనేటి నరసింహ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాయపురం వెంకటేశ్వర్లు ఎల్బీనగర్ నియోజకవర్గం అధ్యక్షుడు ఉంద్రాతి రవి , మహబూబాద్ జిల్లా అధ్యక్షుడు మాదగాని నరేష్. మురళి. వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు కోనేటి నరసింహ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ హైదరాబాదు.

# రాష్ట్రంలో అలజడులు సృష్టించేందుకు వైసీపీ కుట్రలు పన్నుతోంది: జనసేన ఎమ్మెల్యే విజయ్



ఆంధ్రప్రదేశ్‌లో మతాల మధ్య చిచ్చుపెట్టి, అలజడులు సృష్టించేందుకు వైసీపీ తెరవెనుక పెద్ద ఎత్తున కుట్రలు పన్నుతోందని జనసేన ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. వైసీపీ ఆడుతున్న ఈ ప్రమాదకరమైన రాజకీయ క్రీడను ప్రజలంతా గమనించాలని కోరారు.రాష్ట్రంలో సనాతన ధర్మం, హిందుత్వంపై కావాలనే కొందరు ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారని విజయ్ మండిపడ్డారు. ఏలూరు సభలో జడ శ్రవణ్ అనే వ్యక్తి డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ను వ్యక్తిగతంగా టార్గెట్ చేస్తూ మాట్లాడటం వెనుక తాడేపల్లి పెద్దల హస్తం ఉందన్న అనుమానాలు వ్యక్తం చేశారు. మత ఘర్షణలకు ప్లాన్ చేస్తున్న ఈ ముఠాకు, తాడేపల్లికి ఉన్న ఆర్థిక, రాజకీయ సంబంధాల గుట్టును పోలీసులు పూర్తిగా బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు.జగన్‌కు వ్యతిరేకంగా తానే రూ. 25 కోట్లు ఖర్చు పెట్టానని చెప్పుకుంటున్న జడ శ్రవణ్‌కు అసలు అన్ని కోట్ల డబ్బులు ఎక్కడి నుంచి వచ్చాయో సమాధానం చెప్పాలని నిలదీశారు. ప్రశాంతంగా ఉన్న సమాజంలో విషం చిమ్మేందుకు కుట్రలు జరుగుతున్నాయన్నారు. యూట్యూబర్ రావణ్, నటుడు ప్రకాశ్ రాజ్, అలాగే జడ శ్రవణ్‌లకు అసలు సనాతన ధర్మం అంటే ఏంటో తెలుసా? అని ప్రశ్నించారు. వీరంతా కేవలం ఒక అజెండా ప్రకారం పనిచేస్తున్న 'పెయిడ్ ఆర్టిస్ట్‌లు' అని మండిపడ్డారు.కూటమి ప్రభుత్వంలో అన్ని కులాలకు, మతాలకు సమాన గౌరవం లభిస్తుందని స్పష్టం చేసిన ఆయన... హిందుత్వంపై, సనాతన ధర్మంపై ఇలాంటి కుటిల యత్నాలు కొనసాగిస్తే మాత్రం ఎట్టి పరిస్థితుల్లోనూ వదిలిపెట్టే ప్రసక్తే లేదని హెచ్చరించారు.

# ఓటర్లూ అప్రమత్తం.. ఓటు హక్కు కోసం ఫారాలు అందజేయండి

### 14వ తేదీ చివరి గడువు..

### ప్రత్యేక సమగ్ర సవరణకు సహకరించాలి

### : తహసీల్దార్ రియాజుద్దీన్

గీసుగొండ, జులై 10 హైదరాబాద్ ఎస్టేట్: ప్రజాస్వామ్య వ్యవస్థకు పునాది అయిన ఓటు హక్కును ప్రతి ఒక్కరూ పరిరక్షించుకోవాలని గీసుగొండ తహసీల్దార్, సహాయ ఎన్నికల అధికారి (ఏఈఆర్ఓ) యం.డి. రియాజుద్దీన్ కోరారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు చేపట్టిన ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో భాగంగా ఓటర్లు తమ వివరాలను సరిగా నమోదు చేసి, పూర్తి చేసిన ఓటరు ఫారాలను ఈ నెల 14వ తేదీలోపు సంబంధిత బూత్ లెవెల్ అధికారులకు (బీఎల్ఓలకు) అందజేయాలని ఆయన తెలిపారు. ఈ మేరకు తహసీల్దార్ ఒక ప్రకటన విడుదల చేస్తూ.. ఓటర్ల జాబితా మరింత పారదర్శకంగా, పక్కాగా ఉండేందుకు ప్రత్యేక సవరణ ప్రక్రియ చేపట్టినట్లు వివరించారు. గీసుగొండ మండల పరిధిలోని ప్రతి ఇంటికీ బూత్ లెవెల్ అధికారులు వెళ్లి ఓటర్లకు అవసరమైన ఫారాలను ఇప్పటికే అందజేశారని తెలిపారు. ఓటర్లు ఫారాలను నిర్లక్ష్యం చేయకుండా జాగ్రత్తగా పరిశీలించి, తమ పూర్తి వివరాలను స్పష్టంగా నమోదు చేసి, తిరిగి సంబంధిత బీఎల్ఓలకు అందజేయాలని సూచించారు. ఓటర్ల వివరాలను నిర్ణీత గడువులోగా ఆన్‌లైన్‌లో నమోదు చేయాల్సి ఉన్నందున ప్రతి ఒక్కరూ సకాలంలో స్పందించాలని కోరారు.ఓటు హక్కు మన గుర్తింపు..



దానిని కాపాడుకోవడం మన బాధ్యత

ఓటరు జాబితాలో సరైన వివరాలు ఉండటం ద్వారా భవిష్యత్తులో ప్రతి పౌరుడు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తన ఓటు హక్కును వినియోగించుకునే అవకాశం ఉంటుందని తహసీల్దార్ పేర్కొన్నారు. పరకాల నియోజకవర్గం (104) పరిధిలోని గీసుగొండ మండల ఓటర్లందరూ ఈ నెల 14వ తేదీలోపు ఓటరు ఫారాలను తప్పనిసరిగా సంబంధిత బీఎల్ఓలకు అందజేసి, ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ విజయవంతానికి సహకరించాలని తహసీల్దార్ యం.డి. రియాజుద్దీన్ విజ్ఞప్తి చేశారు.

